# క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

హైదరాబాద్
2-9-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 160

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## తదుపరి అమెరికా అధ్యక్షుడు ఎవరు?



తెరపైకి రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పేరు

ఇప్పడే అలాంటి చర్చ అవసరం లేదన్న ట్రంప్

## పూల సుబ్బయ్య ఎవరు?!



వెలిగొండ ప్రాజెక్టుకు ఆయన పేరు

గత రెండు రోజులుగా విస్తృత చర్చ

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** కరువు ప్రాంతానికి కృష్ణమ్మ వెళ్ళింది. వెలిగొండ ప్రాజెక్టు జాతికి అంకితం అయింది. ఏపీ సీఎం చంద్రబాబు ప్రాజెక్టును ప్రారంభించారు. అయితే ఈ ప్రాజెక్టుకు పోలీస్ సుబ్బయ్య అని పేరు పెట్టారు.

- మిగతా 2వ పేజీలో

2లో

## యధావిధిగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్

సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే విధించిన హైకోర్టు



హైదరాబాద్: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. పథకాల అమలుపై సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను సీజే ధర్మాసనం రద్దు చేసింది. పథకాలపై స్టే విధించడాన్ని సవాల్‌చేస్తూ ప్రభుత్వం దాఖలుచేసిన అప్పీలుపై హైకోర్టు

# తెలంగాణలో పొలిటికల్ ఫైట్!

కార్యాలయాలపై దాడులు చేసుకుంటున్న కాంగ్రెస్, బీజేపి శ్రేణులు

దిగజారుతున్న శాంతిభద్రతలు

హై కమాండ్ లు కట్టడి చేయకపోతే కష్టమే

తెలంగాణలో రాజకీయ పోరు కట్టు దాటుతోంది. క్రమశిక్షణ దాటుతోంది. సిద్ధాంతపరంగా పోరాటం చేయాల్సిన రాజకీయ పార్టీలు భౌతిక దాడులకు దిగుతున్నాయి. కాంగ్రెస్, బిజెపి కార్యకర్తలు ఒకరి కార్యాలయాలపై మరొకరు దాడులు చేసుకుంటున్నారు. హైదరాబాదులోని నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద ప్రారంభమైన ఈ వివాదం.. నల్గొండ జిల్లా కేంద్రానికి పాకింది.




**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో** :దాడులు– ప్రతి దాడులతో ఘర్షణ వాతావరణం నెలకొంది. పరస్పర సవాళ్లకు సైతం దారితీస్తోంది. ఇంకా దాడులు చేసుకుంటామని ఎవరికి వారు హెచ్చరిస్తుండటం పరిస్థితి చేయి దాటుతోంది.

**ఆ ఘటనతో ప్రారంభం..**

హైదరాబాదులోని బిజెపి రాష్ట్ర కార్యాలయం వెనుక గేటు పై యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు నల్ల రంగు పూయడంతో ఈ ఉద్రిక్తతలు మొదలయ్యాయి. దీనికి నిరసనగా బిజెపి వర్గాలు నిరసన చేపట్టాయి.

2లో

# కాంగ్రెస్‌కు దానం గుడ్ బై!



పార్టీలో గౌరవం దక్కడం లేదన్న ఆవేదన

కనీస విలువ ఇవ్వలేదని మనస్థాపం

తిరిగి గులాబీ పార్టీ వైపు చూపు?

కాంగ్రెస్ పార్టీ పై దానం నాగేందర్ రగిలిపోతున్నారా? అనవసరంగా కాంగ్రెస్లోకి ఫిరాయించానని భావిస్తున్నారా? కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు లేదని బాధతో ఉన్నారా? అందుకే ఆయన యూటర్న్ తీసుకున్నారా? కెసిఆర్ పై పొగడ్తల వెనుకున్న వ్యూహం ఏంటి? తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్లో దీనిపైనే ప్రచారం నడుస్తోంది. త్వరలో ఆయన గులాబీ పార్టీలో చేరిపోతారన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా.. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేగా ఉన్న దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించారు. ఆ పార్టీ కండువా కప్పుకున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేశారు. బిజెపి అభ్యర్థి కిషన్ రెడ్డి చేతిలో ఓడిపోయారు. భారత రాష్ట్ర సమితి తరపున ఎమ్మెల్యేగా ఎన్నికై.. అదే పదవిలో ఉండగా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు నాగేందర్. దీంతో ఆయనపై అనర్హత వేటు కేసు కొనసాగుతోంది. అయితే అప్పట్లో ఎంపీగా పోటీ చేస్తే మంత్రివర్గంలోకి తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. కానీ కాంగ్రెస్ నాయకత్వం

- మిగతా 2వ పేజీలో

# స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి

బంగారాన్ని అనవసరంగా కొనకండి

డెస్టినేషన్ పేరుతో విదేశాల్లో పెళ్లిళ్లకు దూరం కండి

దేశప్రజల సమిష్టి కృషితోనే జిడిపి వృద్ధిరేటు

దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించడం గర్వకారణం

ఇన్‌స్టా వేదికగా ప్రధాని మోడీ దేశ ప్రజలకు అభినందనలు

**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** భారత్ సాధించిన వృద్ధి రేటు దేశ సమష్టి శక్తికి నిదర్శనమని భారత ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. నిరాశావాదులు మాత్రం తమ అసత్యాలను వ్యాప్తి చేస్తూనే ఉన్నారని విమర్శించారు. యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అడ్డంకుల కారణంగా



3లో

# కొండా సురేఖపై కీలక నిర్ణయం!

సీరియస్ చర్యలు దిశగా హై కమాండ్

ఢిల్లీకి క్యూ కట్టిన నేతలు

విస్తృత చర్చల తర్వాత తుది నిర్ణయం



మంత్రి కొండా సురేఖ పై వేటు తప్పదా? హై కమాండ్ క్రమశిక్షణ చర్యలు తీసుకోనుందా? అందుకే సీఎం రేవంత్ రెడ్డిని ఢిల్లీకి పిలిపించుకుందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. రాష్ట్ర ధర్మాదాయ దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న సురేఖ కుమార్తె సుస్మిత పటేల్ సీఎం రేవంత్ తో పాటు ఇతర ముఖ్య నేతలపై అనుచిత వ్యాఖ్యలు చేశారు.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** దీనిపై మంత్రి సురేఖకు క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ అయ్యాయి. ఇప్పటికే నివేదికలు హై కమాండ్ కు చేరాయి. అందుకే ఇప్పుడు కాంగ్రెస్ అధిష్టానం తుది నిర్ణయం తీసుకునేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

- మిగతా 2వ పేజీలో

# హైడ్రా కమిషనర్‌కు భారీ ఊరట!

రంగనాథ్ ను తొలగించాలని హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశం

దానిని కొట్టి వేస్తూ ఈరోజు డివిజనల్ బెంచ్ నిర్ణయం

యధావిధిగా విధుల్లో కొనసాగనున్న హైదరాబాద్ విపత్తుల స్పందన, ఆస్తుల పర్యవేక్షణ, రక్షణ సంస్థ కమిషనర్

**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్:** హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు భారీ ఊరట లభించింది. తెలంగాణ హైకోర్టులో ఆయనకు అనుకూలంగా తీర్పు వచ్చింది. హైడ్రా కమిషనర్ బాధ్యతల నుంచి రంగనాథ్ ను తొలగించాలంటూ

- మిగతా 2వ పేజీలో



# అందాల సిగ్నేచర్ బ్రిడ్జి!

విజయవాడ– అమరావతి మధ్య కొత్త వంతెన

అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించేందుకు నిర్ణయం

రూ.1000 కోట్లతో రూపుదిద్దుకోనున్న వైనం..



**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** అమరావతి రాజధానిలో మరో కీలక ప్రాజెక్ట్. అమరావతి– విజయవాడల మధ్య రాకపోకలను మరింత వేగవంతం చేసేందుకు

# ఎంఐఎం పట్టు సడలుతోందా?

ఓవైసీ బ్రదర్స్ ఆదేశాలు బుట్ట దాఖలు

ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసేది లేదంటున్న రహమత్ బేగ్

పాత బస్తీలో సరికొత్త ప్రకంపనలు

3లో

# కెసిఆర్‌కు ఎదురుగా వచ్చే దమ్ముందా?

కెసిఆర్ అంటే అనుక్షణం భయంతో చస్తున్న రేవంత్

ఆంధ్రాకు నీరు తరలిస్తున్నా అడ్డుకోని అసమర్థ సిఎం

మీడియా సమావేశంలో మండిపడ్డ జగదీశ్ రెడ్డి

మిర్యాలగూడ సభ నిర్వహించి తీరుతామని వెల్లడి



# తెలంగాణలో పొలిటికల్ ఫైట్!

నల్గొండ బిజెపి జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి ఆధ్వర్యంలో నల్గొండ లోని శ్రీనగర్ కాలనీలో ఆర్ అండ్ బి శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాత క్యాంప్ ఆఫీస్ పై.. బిజెపి శ్రేణులు గుడ్లు, టమోటాలు విసిరి.. మంత్రి ఫ్లెక్సీలను చింపేశారు. మంత్రి కార్యాలయం పై దాడి వార్త తెలిసిన వెంటనే కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్ర ఆగ్రహంతో రోడ్డెక్కాయి. బిజెపి జిల్లా అధ్యక్షుడు వర్షిత్ రెడ్డి నివాసం పై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారు. ఫర్నిచర్ ధ్వంసం చేశారు. అంతటితో ఆగకుండా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బిజెపి జిల్లా కార్యాలయం పై కూడా దాడికి ప్రయత్నించారు. లోపల ఉన్న బిజెపి నేతలు తలుపులు మూసుకొని ప్రాణాలు దక్కించుకోవాల్సి వచ్చింది.

**స్పందించిన అధిష్టానాలు..**

అయితే ఇలా రాజకీయ పార్టీల కార్యాలయాలపై పరస్పర దాడులు నిర్వహించుకోవడం శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుంది. అయితే ఈ రెండు ఘటనలపై ఆ పార్టీ హైకమాండులు తీవ్రంగా స్పందించాయి. కాంగ్రెస్ ప్రభుత్వ అధికార దుర్వినియోగానికి ఇది ప్రత్యక్ష నిదర్శనం అని బిజెపి నాయకత్వం మండిపడుతోంది. కంట్రోల్ తప్పి ప్రవర్తిస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ప్రస్తుతానికైతే ఈ వైరం కార్యకర్తల స్థాయిలోనే ఉంది. నాయకుల స్థాయిలోకి వెళ్తే మరింత ముదిరే అవకాశం ఉంది. ఈ విషయంలో రాజకీయ పార్టీల అధినేతలు జోక్యం చేసుకొని నియంత్రించాల్సిన అవసరం ఉంది. లేకుంటే మాత్రం ఇబ్బందికర పరిస్థితులు తప్పవు.

## యధావిధిగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం విచారణ చేపట్టింది. ఈ పథకాల నిమిత్తం ప్రభుత్వం 2014 నుంచి జారీ చేసిన 8 జీవోలను సవాల్‌చేస్తూ న్యాయవాది విజయ్‌గోపాల్ వ్యక్తిగత హోదాలో దాఖలు చేసిన పిటిషన్‌లో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంతో పథకాల అమలును నిలిపివేస్తూ సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ 2014 నుంచి అమలవుతున్న సంక్షేమ పథకాలపై పిటిషన్ దాఖలైందన్నారు. ఈ పథకాల అమలు.. పిటిషనర్‌పై ఎలాంటి ప్రభావం చూపడంలేదని, అతని హక్కులకూ భంగం వాటిల్లలేదని, అంతేకాకుండా పథకం లబ్దిదారు కూడా కాదన్నారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని పేర్కొన్నారు. షాదీ ముబారక్ లాంటి పథకాన్ని సుప్రీంకోర్టు అనుమతించిందని, అలాంటిదే కల్యాణలక్ష్మి పథకమన్నారు. ఈ పిటిషన్ సింగిల్ జడ్జి వద్ద విచారణార్హం కాదని, ప్రభుత్వ విధాన నిర్ణయాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించే పరిధి ఈ డివిజన్ బెంచ్‌కు ఉందన్నారు. పథకం అమలుపై ఉన్న మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరారు. ఏజీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. స్టేను ఎత్తివేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

## కెసిఆర్‌కు ఎదురుగా వచ్చే దమ్ముందా?

(మొదటి పేజీ తరువాయి)

సూర్యాపేట: రాష్ట్రంలో నీటి సమస్యలు తీవ్రంగా మారుతున్నా ప్రభుత్వ పెద్దలు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా అవినీతి సొమ్మును లెక్కించే పనిలో ఉన్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ఆరోపించారు. సూర్యాపేటలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు ఆయన వ్యక్తిత్వానికి అద్దం పడుతున్నాయని జగదీశ్ రెడ్డి అన్నారు. కేసీఆర్ అంటే అనుక్షణం భయంతోనే రేవంత్ రెడ్డి రోత మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. కేసీఆర్‌ను ఎక్కువగా గుర్తు చేసుకునే వారిలో రేవంత్ రెడ్డిదే ప్రథమ స్థానమని ఎద్దేవా చేశారు. 'కేసీఆర్‌కు ఎదురుగా వచ్చే దమ్ము నీకుందా?' అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రేవంత్ రెడ్డి సచివాలయానికి ఎన్నిసార్లు వచ్చారో లెక్కలు తీయడానికి సిద్ధమా? అని జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. వెలిగొండ ప్రాజెక్టుపై మాట్లాడే దమ్ము ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎందుకు లేదని జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. కళ్లముందే నీరు కనిపిస్తున్నా ఆ నీటిని ఆంధ్రా ప్రాంతానికి తరలిస్తుంటే అడ్డుకోలేని పరిస్థితికి ప్రభుత్వ అసమర్థత, అవినీతే కారణమని ఆరోపించారు. తనకు రాజకీయంగా ఎదగడానికి అవకాశం కల్పించిన మహబూబ్‌నగర్ జిల్లాకు రేవంత్ రెడ్డి ద్రోహం చేస్తున్నారని జగదీశ్ రెడ్డి విమర్శించారు. పాలమూరు ప్రాంతంలో మళ్లీ వలసలు పెరగడానికి ప్రభుత్వ విధానాలే కారణమవుతున్నాయని ఆరోపించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు అన్యాయం జరుగుతున్నా జిల్లా మంత్రులు నోరు మెదపడం లేదని ఆయన మండిపడ్డారు. కళ్ల ముందే నీటి సమస్యలు కనిపిస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. రాష్ట్రంలోని అనేక పట్టణాలు, పల్లెల్లో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని జగదీశ్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వ హయాంలో 24 గంటల విద్యుత్, తాగునీటి సరఫరాపై దృష్టి పెట్టామని, ప్రస్తుత ప్రభుత్వం కరెంట్, నీరు అందించడంలో విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, వైఫల్యాలపై రేపటి నుంచి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరుబాట ప్రారంభమవుతుందని జగదీశ్ రెడ్డి ప్రకటించారు. ముఖ్యంగా రైతాంగ సమస్యలు, వ్యవసాయ సంక్షోభంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. ల్గ÷తాంగ సమస్యలు, వ్యవసాయ సంక్షోభంపై కేటీఆర్ ఆధ్వర్యంలో మిర్యాలగూడలో భారీ రైతు సభ నిర్వహించనున్నట్లు జగదీశ్ రెడ్డి తెలిపారు. ఈ సభకు రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావడానికి సిద్ధమవుతున్నారని చెప్పారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా మిర్యాలగూడలో కేటీఆర్ రైతు సభను నిర్వహించి తీరుతామని జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ఆయన తెలిపారు.

## అందాల సిగ్నేచర్ బ్రిడ్జి!

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం బృహత్తర ప్రణాళికను సిద్ధం చేసింది. ప్రకాశం బ్యారేజీ వద్ద ఎదురవుతున్న సవాళ్లను అధిగమిస్తూ.. కృష్ణ నదిపై అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రతిష్టాత్మక సిగ్నేచర్ బ్రిడ్జి నిర్మాణానికి సంసిద్ధత వ్యక్తం చేసింది. 1000 కోట్ల రూపాయల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టనుంది. ప్రభుత్వం ఈ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించింది. డిపిఆర్ తయారీకి ప్రాథమికంగా అడుగులు వేస్తోంది.

**కేవలం బ్రిడ్జిగానే కాకుండా..**

అయితే ఈ సిగ్నేచర్ బ్రిడ్జి ను కేవలం రవాణా రాకపోకలకు మాత్రమే కాదు. అమరావతి రాజధానికి మణిహారంగా నిలిపేందుకు ఈ వంతెన నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా పూర్తి చేయాలని చూస్తోంది. విజయవాడ ప్రకాశం బ్యారేజీ, రైల్వే వంతెనల మధ్య ప్రాంతంలో నిర్మించేలా ప్రణాళికలను రూపొందిస్తున్నారు. సుమారు 1.10 కిలోమీటర్ల పొడవున.. ఆరు లేన్ల విశాలమైన రహదారితో ఈ వంతెన నిర్మాణం జరగనుంది. విజయవాడ నగరంతో పాటు సీడ్ యాక్సిస్ రోడ్డు ద్వారా అమరావతికి అత్యుత్తమ కనెక్టివిటీని అందించి... భవిష్యత్తులో పెరగబోయే ట్రాఫిక్ అవసరాలకు శాశ్వత పరిష్కార మార్గంగా నిలవనుంది.

**పర్యాటకంగా సైతం..**

పర్యాటకంగా సైతం దీనిని మలచనున్నారు. కేవలం రవాణా వ్యవస్థ కోసమే కాకుండా.. రాజధాని అమరావతికి ఒక ఐకానిక్ ల్యాండ్ మార్కుగా, పర్యాటక ఆకర్షణగా తీర్చిదిద్దనున్నారు. ఇందులో భాగంగా వంతెన ఇరువైపులా కాలినడకన వెళ్లే వారి కోసం ఫుడ్ పాత్ లు, పర్యావరణహిత ప్రయాణాన్ని ప్రోత్సహించేలా ప్రత్యేక సైకిల్ ట్రాక్లను ఏర్పాటు చేయనున్నారు. నది అందాలను తిలకించేలా ఆధునిక లైటింగ్, ప్రత్యేక వ్యూ పాయింట్లతో ఈ వంతెనను డిజైన్ చేస్తున్నారు. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీ పై విపరీతమైన ట్రాఫిక్ రద్దీ ఉంది. కృష్ణా నదిపై రూపుదిద్దుకోబోతున్న ఈ మౌలిక వస్తువుల ప్రాజెక్టు ఏపీ రవాణా రంగానికి కొత్త ఊపిరి పోయినది. పర్యాటక రంగానికి పెద్ద పీట వేస్తూ.. అమరావతి అభివృద్ధి ప్రస్థానంలో మరొక ప్రతిష్టాత్మకమైన కట్టడం గా.. ఈ సిగ్నేచర్ బ్రిడ్జి నిలవనుంది.

## కాంగ్రెస్‌కు దానం గుడ్ బై!

(మొదటి పేజీ తరువాయి)



దానం నాగేందర్ విషయంలో పెద్దగా పట్టించుకోలేదు. అదే సమయంలో ఎంపీగా పోటీ చేయించి ఓడిపోవడం కూడా ఆయన పొలిటికల్ ఇమేజ్ను దెబ్బతీసింది. ఒకవైపు రాజకీయ ఇబ్బందులు, ఇంకోవైపు కాంగ్రెస్ హై కమాండ్ పట్టించుకోకపోవడంపై దానం నాగేందర్ పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. అందుకే తిరిగి ఆయన భారత రాష్ట్ర సమితి వైపు చూస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగానే ఆయన కెసిఆర్ పై పొగడ్తల వర్షం కురిపించినట్లు తెలుస్తోంది.

**సీనియర్ మోస్ట్ లీడర్..**

దానం నాగేందర్ సీనియర్ మోస్ట్ లీడర్. సుదీర్ఘకాలం రాజకీయాల్లో కొనసాగుతూ వచ్చారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన ఆయన 1994లో తొలిసారిగా ఆసిఫ్ నగర్ నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. 1999లో సైతం విజయం సాధించారు. 2004లో ఆయనకు టికెట్ లభించలేదు. దీంతో తీవ్ర ఆవేదనకు గురైన ఆయన తెలుగుదేశం పార్టీలో చేరారు. చివరి నిమిషంలో ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. కానీ ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో వెంటనే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చవిచూశారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరగడంతో ఆసిఫ్ నగర్ నియోజకవర్గం కనుమరుగయింది. దీంతో ఖైరతాబాద్ నుంచి 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. రాజశేఖర్ రెడ్డి క్యాబినెట్లో మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కాంగ్రెస్ పార్టీ తరఫున 2014 ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు దానం నాగేందర్. 2018 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పి తెలంగాణ రాష్ట్ర సమితిలో చేరారు. ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 2023 ఎన్నికల్లో సైతం అదే పార్టీ తరఫున పోటీ చేసిన ఆయన గెలుపొందారు. కానీ పార్టీ అధికారంలోకి రాకపోవడంతో కాంగ్రెస్ లోకి ఫిరాయించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. కానీ కాంగ్రెస్ పార్టీ అనుకున్నంతగా గుర్తింపు ఇవ్వకపోవడంతో ఆయన తీవ్ర మనస్తాపంతో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. త్వరలో భారత రాష్ట్ర సమితిలో చేరుతారన్న టాక్ కూడా నడుస్తోంది. మరి ఆ ప్రచారంలో నిజం ఎంత ఉందో చూడాలి.

## పూల సుబ్బయ్య ఎవరు?!

ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవ వేదికపై పూల సుబ్బయ్య కుమార్తెలు విలాసిని, సునంద నీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వారిని సీఎం చంద్రబాబు సన్మానించడంతో రాష్ట్రవ్యాప్తంగా పూల సుబ్బయ్య పై చర్చ మొదలైంది. కరువు నేలకు కృష్ణా జలాలను తరలించాలని పోరాటం చేసిన ఏకైక వ్యక్తి పూల సుబ్బయ్య. ఎన్నో ఉద్యమాలు చేశారు. ఆయన చేసిన పోరాటాన్ని గుర్తించి నందమూరి తారక రామారావు ఒక నివేదికను కోరారు అప్పటి ఇంజనీరింగ్ సలహాదారుడు రామకృష్ణ. కార్యక్రమంలో అదే ప్రాజెక్టును ముందుకు తీసుకొచ్చారు చంద్రబాబు. సరిగ్గా 30 సంవత్సరాల కిందట ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి.. నేడు ప్రారంభించారు. అయితే కృష్ణా జలాలను కరువు సీమకు తరలించాలని ఉద్యమించిన పూల సుబ్బయ్య పేరును ప్రాజెక్టుకు పెట్టారు చంద్రబాబు. ఆయన గురించి ఒకసారి తెలుసుకుందాం.

**కమ్యూనిస్టు నాయకుడు..**

పూల సుబ్బయ్య ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు. మార్కాపురం జిల్లా కంభం లో 1929లో జన్మించారు. ఆయన బాల్యంలోనే ఉండగానే తండ్రి చనిపోయాడు. తల్లి కష్టపడి చదివించింది. విద్యార్థి దశ నుంచి కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితులయ్యారు. ఏఐఎస్ఎఫ్ నాయకుడిగా, న్యాయవాదిగా, కార్మిక సంఘం నాయకుడిగా, తాలూకా, జిల్లాస్థాయి పదవులు చేపడుతూ ఏపీ రైతు సంఘం కార్యదర్శిగా ఎదిగారు. 1962, 67లో ఎర్రగొండపాలెం సిపిఐ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. మూడోసారి 1978లో మార్కాపురం నుంచి గెలిచారు. గిరిజన హక్కుల కోసం పోరాడారు. ఆ సమయంలోనే తాగు, సాగునీటి సౌకర్యాలు లేక కరువుతో అల్లాడుతున్న ప్రకాశం జిల్లా ప్రజలకు కృష్ణా జలాలు తరలించాలని ఉద్యమ బాట పట్టారు.

**అలా పట్టాలెక్కిన ప్రాజెక్ట్..**

అప్పట్లో పశ్చిమ ప్రకాశం ప్రజల ఆర్తనాదాలు విన్న అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ప్రాజెక్టుకు సంబంధించి డిపిఆర్ తయారు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. అలా ఎన్టీఆర్ హయాంలో పురుడు పోసుకున్న ప్రాజెక్టుకు 1996 మార్చి ఐదున చంద్రబాబు శంకుస్థాపన చేశారు. మూడు దశాబ్దాల పాటు అనేక పరిణామాలు చోటుచేసుకుని మొదటి దశ పూర్తి చేసుకుంది వెలిగొండ ప్రాజెక్టు. కానీ ఈ ప్రాంతం కోసం పోరాటం చేసిన పూల సుబ్బయ్య 1988లో అనారోగ్యంతో మృతి చెందారు. అయితే వెలిగొండ ప్రాజెక్టుకు పూల సుబ్బయ్య పేరు పెట్టాలన్న ప్రతిపాదన రావడంతో.. ఆయన పేరును ఖరారు చేసింది ప్రభుత్వం. అందుకే పూల సుబ్బయ్య కుమార్తెలను వేదిక పైకి పిలిచి మరి సన్మానించారు చంద్రబాబు.

## హైడ్రా కమిషనర్‌కు భారీ ఊరట!

(మొదటి పేజీ తరువాయి)

గతంలో హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును.. డివిజనల్ బెంచ్ సస్పెండ్ చేసింది. ఈ మేరకు సింగిల్ జడ్జి ఉత్తర్వులపై స్టే విధిస్తూ న్యాయస్థానం కీలకతీర్ణం వెల్లడించింది. గతంలో హైడ్రా కమిషనర్ నియామకం, బాధ్యతల నిర్వహణకు సంబంధించి దాఖలైన పిటిషన్ ను విచారించిన సింగిల్ బెంచ్.. రంగనాథ్ ఆ పదవి నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ ప్రభుత్వం తరఫున, సంబంధిత వర్గాలు వెంటనే హైకోర్టు డివిజన్ బెంచ్ ను ఆశ్రయించి ఆపిల్ ను దాఖలు చేశాయి. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పులో అంశాలను పున పరిశీలించాలని కోరాయి.

**దూకుడుగా హైడ్రా..**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో హైదరాబాద్ దూకుడుగా వ్యవహరిస్తూ వచ్చింది. అక్రమ నిర్మాణాల పేరుతో పెద్ద ఎత్తున కూల్చివేతలకు పాల్పడింది. చెరువులతోపాటు ప్రభుత్వ ఆస్తుల సంరక్షణ పేరుతో పెద్ద ఎత్తున భూములను స్వాధీనం చేసుకుంది. ఈ క్రమంలో వేలకోట్ల రూపాయల ఆస్తులు తెలంగాణ ప్రభుత్వానికి తిరిగి దక్కాయి. అయితే దశాబ్దాలుగా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్న ఆస్తులు వెనక్కి రావడంతో వారంతా న్యాయస్థానాలను ఆశ్రయించారు. అయితే న్యాయస్థానాల ఆదేశాలను పాటించకుండా హైదరాబాద్ ముందుకు వెళ్లిందన్న విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో చాలా సార్లు కోర్టు ధిక్కరణ నోటీసులు కూడా అందుకుంది హైడ్రా. ఈ క్రమంలో కోర్టు హైడ్రా కమిషనర్ను బాధ్యతల నుంచి తప్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ముఖ్యంగా హైకోర్టు సింగిల్ బెంచ్ ఈ తీర్పు ఇచ్చింది. దీనిని సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వ వర్గాలు డివిజనల్ బెంచ్ ను ఆశ్రయించాయి.

**ఈరోజు విచారణ..**

తెలంగాణ ప్రభుత్వం నుంచి వచ్చిన పిటిషన్ అనుసరించి విచారణ చేపట్టింది హైకోర్టు డివిజనల్ బెంచ్. సింగిల్ బెంచ్ జారీ చేసిన తొలగింపు ఉత్తర్వులను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. దీంతో హైడ్రా కమిషనర్ గా రంగనాథ్ తన విధులను యధావిధిగా కొనసాగించేందుకు మార్గం సుగమం అయింది. ఈ కేసుకు సంబంధించిన తదుపరి పూర్తిస్థాయి విచారణను హైకోర్టు నవంబర్ మూడుకు వాయిదా వేసింది. హైదరాబాద్ నగరంలో చెరువులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ దిశగా హైడ్రా దూకుడుగా వ్యవహరిస్తున్న తరుణంలో హైకోర్టు డివిజనల్ బెంచ్ ఇచ్చిన ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది.

## కెసిఆర్‌కు ఎదురుగా వచ్చే దమ్ముందా?

సూర్యాపేట,సెప్టెంబర్1(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో నీటి సమస్యలు తీవ్రంగా మారుతున్నా ప్రభుత్వ పెద్దలు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా అవినీతి సొమ్మును లెక్కించే పనిలో ఉన్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ఆరోపించారు. సూర్యాపేటలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు ఆయన వ్యక్తిత్వానికి అద్దం పడుతున్నాయని జగదీశ్ రెడ్డి అన్నారు. కేసీఆర్ అంటే అనుక్షణం భయంతోనే రేవంత్ రెడ్డి రోత మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. కేసీఆర్‌ను ఎక్కువగా గుర్తు చేసుకునే వారిలో రేవంత్ రెడ్డిదే ప్రథమ స్థానమని ఎద్దేవా చేశారు. 'కేసీఆర్‌కు ఎదురుగా వచ్చే దమ్ము నీకుందా?' అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రేవంత్ రెడ్డి సచివాలయానికి ఎన్నిసార్లు వచ్చారో లెక్కలు తీయడానికి సిద్ధమా? అని జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. వెలిగొండ ప్రాజెక్టుపై మాట్లాడే దమ్ము ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎందుకు లేదని జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. కళ్లముందే నీరు కనిపిస్తున్నా ఆ నీటిని ఆంధ్రా ప్రాంతానికి తరలిస్తుంటే అడ్డుకోలేని పరిస్థితికి ప్రభుత్వ అసమర్థత, అవినీతే కారణమని ఆరోపించారు. తనకు రాజకీయంగా ఎదగడానికి అవకాశం కల్పించిన మహబూబ్‌నగర్ జిల్లాకు రేవంత్ రెడ్డి ద్రోహం చేస్తున్నారని జగదీశ్ రెడ్డి విమర్శించారు. పాలమూరు ప్రాంతంలో మళ్లీ వలసలు పెరగడానికి ప్రభుత్వ విధానాలే కారణమవుతున్నాయని ఆరోపించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు అన్యాయం జరుగుతున్నా జిల్లా మంత్రులు నోరు మెదపడం లేదని ఆయన మండిపడ్డారు.

## తదుపరి అమెరికా అధ్యక్షుడు ఎవరు?

వాషింగ్టన్: అమెరికా తదుపరి అధ్యక్షుడిగా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పేరు తెరపైకి వస్తున్న వేళ డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2028 ప్రెసిడెంట్ ఎలక్షన్స్‌లో పోటీచేసే అవకాశాలపై మాట్లాడిన అగ్రరాజ్య అధ్యక్షుడు.. ఆ విషయమై ఇప్పుడే చర్చ అక్కర్లేదని సమాధానాన్ని దాటవేశారు. 'హెగ్సెత్ అద్భుతంగా పనిచేస్తున్నారు. అయితే ఇలాంటి విషయాల గురించి మాట్లాడేందుకు ఇది తొందరపాటు చర్య అవుతుంది. ముందుగా నవంబర్‌లో జరిగే మధ్యంతర ఎన్నికలను పూర్తి చేయాలి' అని ట్రంప్ అన్నారు. యూఎస్ ప్రెసిడెంట్‌గా రెండు పర్యాయాలు మాత్రమే కొనసాగే అవకాశమున్న ట్రంప్.. 2029లో ఆ పదవి నుంచి తప్పుకోనున్నారు. దీంతో ఆయన 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' ఉద్యమాన్ని ముందుకు నడిపించే తదుపరి నేత ఎవరన్న దానిపై రిపబ్లికన్ పార్టీలో చర్చ జోరందుకుంది. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్లు ఇప్పటికే వినిపిస్తున్నా.. తాజాగా ఆ లిస్ట్‌లో హెగ్సెత్ కూడా ఉన్నట్టు తెలుస్తోంది. మరోవైపు ఇటీవల ఐయోవా స్టేట్ ఫెయిర్‌లో రిపబ్లికన్ల తరఫున హెగ్సెత్ ప్రచారం చేయడం ఈ ఊహాగానాలకు బలం చేకూర్చినట్లైంది. అయితే ఈ వార్తలను హెగ్సెత్ ఖండించారు. అవి '100 శాతం అవాస్తవం' అని సోషల్ మీడియాలో పేర్కొన్నారాయన. హెగ్సెత్ గతంలో ఆర్మీ నేషనల్ గార్డ్‌లో పనిచేశారు. అనంతరం ఫాక్స్ న్యూస్ ఛానల్‌లో టీవీ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ప్రస్తుతం ట్రంప్ ప్రభుత్వంలో రక్షణ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే ఆయన రాజకీయ భవితవ్యంపై ట్రంప్ మరింత ఆసక్తికరంగా స్పందించారు. 'ప్రస్తుతం ఆయనకు సైన్యం, సైనికుల సంక్షేమం తప్ప మరేదీ ముఖ్యం కాదు'



# కొండా సురేఖపై కీలక నిర్ణయం!



సర్వత్ర చర్చ.. మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి హుటాహుటిన ఢిల్లీ ప్రయాణం కావడం హాట్ టాపిక్ అవుతుంది. సురేఖ పై పార్టీ క్రమశిక్షణ కమిటీ సమర్పించిన నివేదికను పరిశీలించిన తర్వాత ఏఐసీసీ పెద్దలు.. సురేఖ వ్యవహారానికి సంబంధించి వీలైనంత త్వరగా ముగింపు పలకాలని భావిస్తున్నారు. అందులో భాగంగానే తెలంగాణకు చెందిన ముఖ్య నేతలు అందరిని ఢిల్లీకి రప్పించి విస్తృత స్థాయిలో చర్చలు జరపాలని నిర్ణయించారు.

**టిపిసిసి చీఫ్ సైతం..**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి కూడా నేడు సాయంత్రానికి ఢిల్లీకి వెళ్ళనున్నారు. వీరితో పాటు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కు కూడా అధిష్టానం నుంచి పిలుపు వచ్చింది. ఆయన సైతం ఢిల్లీ పర్యటనకు వెళ్తున్నట్లు సమాచారం. సురేఖ కుమార్తె చేసిన వ్యాఖ్యలు, వరంగల్ జిల్లా నేతలతో ఉన్న విభేదాలపై ఇప్పటికే క్రమశిక్షణ సంఘం ఒక సమగ్ర నివేదికను ఏఐసీసీకి అందజేసింది. తరువాత ఈ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.

**నేతలతో వేరువేరుగా భేటీ..**

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, సీనియర్ నేత కేసి వేణుగోపాల్ తో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం కానున్నారు. అదే సమయంలో ఇతర ముఖ్య నేతలు, టిపిసిసి అధ్యక్షుడు వేర్వేరుగా సమావేశం అవుతారని తెలుస్తోంది. సురేఖను క్యాబినెట్ నుంచి తప్పించాలా? లేదా ఆమెతో స్వచ్ఛందంగా రాజీనామా చేయించాలా? అనే అంశాలపై ఈ సమావేశంలో కీలక చర్చ జరగనుంది. ఒకవేళ సురేఖను పదవి నుంచి తొలగిస్తే తలెత్తే రాజకీయ పరిణామాలు, సామాజిక సమీకరణలు, త్వరలో చేపట్టబోయే మంత్రివర్గ విస్తరణ, చేర్పులు మార్పులపై కూడా నేతల అభిప్రాయాలను సేకరించనుంది హై కమాండ్. మరి చివరికి ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందో చూడాలి.

## రష్యా సైన్యంలో 51మంది భారతీయులు మృతి

### విదేశాంగ శాఖ సెక్రటరీ విక్రమ్ మిశ్రీ వెల్లడి

న్యూఢిల్లీ,సెప్టెంబర్1(ఆర్ఎన్ఎ): రష్యా సైన్యంలోని 51 మంది భారతీయులు మరణించారని విదేశాంగ శాఖ సెక్రటరీ విక్రమ్ మిశ్రీ వెల్లడించారు. మొత్తం 227 మంది రష్యాలో సైన్యంలో చేరగా ఇప్పటివరకూ 139 మంది బయటకు వచ్చేశారని అన్నారు. మిగిలిన వారినీ వెనక్కు తీసుకొచ్చేందుకు రష్యాతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కిర్గిస్థాన్ పర్యటన నేపథ్యంలో సోమవారం మీడియా అడిగిన ప్రశ్నలకు విదేశాంగ శాఖ సెక్రటరీ ఈ వివరాలను వెల్లడించారు. ఈ అంశంలో రష్యాతో వివిధ స్థాయిల్లో చర్చలు జరుగుతున్నాయని మిశ్రీ చెప్పారు. మాస్కోలోని భారతీయ ఎంబసీ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ భారతీయులను వెనక్కు రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. భారతీయులు త్వరగా సైన్యం నుంచి డిశ్చార్జ్ అయ్యేలా రష్యా చర్యలు తీసుకోవాలని కోరినట్టు చెప్పారు. రష్యా-భారత్ వాణిజ్యం గురించి కూడా మిశ్రీ మాట్లాడారు. గతేడాది భారత్‌లో రష్యన్ దిగుమతిదారుల సమావేశంలో అక్కడి సంస్థలు ఉత్సాహంగా పాల్గొన్నాయని చెప్పారు. భారత్ నుంచి దిగుమతులను పెంచేందుకు ఉత్సుకత ప్రదర్శించాయని చెప్పారు. తదుపరి రష్యాలో జరుగునున్న సమావేశంలో భారతీయ ఎగుమతిదారుల ఫోరం సమావేశం నిర్వహిస్తామని చెప్పారు.

## ఎంఐఎం పట్టు సడలుతోందా?



క్రైమ్ మిర్రర్, హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో ఎంఐఎం పార్టీది ప్రత్యేక స్థానం. ముఖ్యంగా హైదరాబాద్ పాతబస్తీ ప్రాంతంలో ఆ పార్టీ పాతుకు పోయింది. ఎన్ని రాజకీయ పార్టీలు వచ్చినా వారి సంప్రదాయ బలాన్ని మాత్రం తగ్గించలేకపోతున్నారు. కానీ అటువంటి పార్టీలో ఇప్పుడు ఓవైసీ బ్రదర్స్ పట్టు తప్పుతోందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇంతవరకు ఓవైసీ బ్రదర్స్ మాటే శాసనం. దశాబ్దాలుగా అధిష్టానం నుంచి ఒక ఆదేశం వస్తే శిరసా వహించడం తప్ప ఎదురు చెప్పే ధైర్యం ఏ నాయకుడికి లేదు. క్యాడర్ సైతం ఆ బ్రదర్స్ ఆదేశాలు పాటించాల్సిందే. అటువంటిది ఒక ధిక్కారస్వరం ఇప్పుడు వినిపించింది. మైనర్ పై లైంగిక దాడికి పాల్పడినట్లుగా ఆరోపణలతో పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్.. ఓవైసీ ఆదేశాలను ధిక్కరిస్తూ తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసేది లేదని స్పష్టం చేయడం సంచలనంగా మారింది.

**సాధారణ డ్రైవర్ నుంచి ఎమ్మెల్సీగా..**

ఒక సాధారణ ఎమ్మెల్యే డ్రైవర్గా ప్రస్థానం ప్రారంభించి.. హై కమాండ్ దయతో ఎమ్మెల్సీ స్థాయికి ఎదిగారు రహమత్ బేగ్. లైంగిక వేధింపుల ఆరోపణలతో పాటు సంచలనాత్మక వీడియో లీక్ వివాదం రావడంతో.. అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వం రద్దు చేయడమే కాకుండా ఎమ్మెల్సీ పదవికి వెంటనే రాజీనామా సమర్పించాలని డిమాండ్ చేశారు. అయితే ఊహించని విధంగా బేగ్ పార్టీ అధినేతల ఆదేశాలు పాటించకుండా.. నేను రాజీనామా చేయను, చట్ట ప్రకారమే ముందుకు వెళ్తానంటూ తెగేసి చెప్పారు. దీంతో ఓవైసీ సోదరులకు ఒక్కసారిగా మైండ్ బ్లాక్ అయింది..


**గొప్ప సాహసం..**

సాధారణంగా ఎంఐఎం నుంచి బహిష్కరణకు గురైన నేతకు వేరే రాజకీయ భవిష్యత్తు కూడా ఉండదు. ఆయనను తమ పార్టీలోకి చేర్చుకునేందుకు ప్రధాన పార్టీలు సాహసించవు. అటు రాజకీయ మద్దతు లేక.. ఎంఐఎం తిరుగుబాటుదారుడుగా ముద్రపడిన.. ఎమ్మెల్సీగా శాసనమండలి సభ్యత్వాన్ని వదులుకోవడానికి రహమత్ బేగ్ సిద్ధంగా లేకపోవడం పాతబస్తీ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఒకప్పుడు పాత బస్తీని తమ గుప్పెట్లో పెట్టుకుని క్యాడర్ను శాసించిన ఓవైసీల స్వరం ఇప్పుడు సొంత పార్టీ ఎమ్మెల్సీ వద్ద పనిచేయడం లేదా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉందన్న దానితో సంబంధం లేదు. పాతబస్తీలో మాత్రం ఎంఐఎం అది కూడా ఓవైసీ బ్రదర్స్ ఆదేశాలతోనే నడిచేవి రాజకీయాలు. కానీ ఇప్పుడు పరిస్థితి మారుతుంది అన్న సంకేతాలు కనిపిస్తున్నాయి.

## మిర్యాలగూడ బిఆర్ఎస్ రైతుర్యాలీకి అనుమతి నిరాకరణ

### ట్రాఫిక్ సమస్యలు ఏర్పడే అవకాశం ఉందన్న పోలీసులు

### గ్రౌండ్ లేదా, హాలు లాంటి చోట్ల అయితే అభ్యంతరం లేదని వెల్లడి



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** మిర్యాలగూడలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన రైతు ర్యాలీ, బహిరంగ సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. శాంతిభద్రతలు, ట్రాఫిక్ సమస్యలను కారణంగా చూపుతూ కేటీఆర్ ర్యాలీ, మీటింగ్‌కు అనుమతి ఇవ్వలేమని తిరస్కరించారు. ఈనెల 3న మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి రాజీవ్ చౌక్ వరకు రైతు ర్యాలీ నిర్వహించడంతో పాటు రాజీవ్ చౌక్‌లో బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ ర్యాలీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో ర్యాలీకి అనుమతి కోరుతూ బీఆర్ఎస్ మిర్యాలగూడ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు. వ్యవసాయ రంగం, సాగునీరు, విద్యుత్, యూరియా కొరత, రైతు భరోసా తదితర రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దరఖాస్తులో పేర్కొన్నారు. దీనిపై మిర్యాలగూడ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి అనుమతి నిరాకరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే రాజీవ్ చౌక్ ప్రధాన కూడలి కావడంతో భారీ సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు, రైతులు తరలివస్తే అన్ని వైపుల నుంచి ట్రాఫిక్ నిలిచిపోయే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు. రాజీవ్ చౌక్‌కు వచ్చే రహదారులు ఇరుకుగా ఉండటంతో పాటు ఈ ప్రాంతంలో రోజంతా భారీగా వాహనాల రాకపోకలు సాగుతుంటాయని తెలిపారు. అక్కడ ట్రాఫిక్‌ను మళ్లించేందుకు తగిన ప్రత్యామ్నాయ మార్గాలు కూడా లేవని, వాహనాల పార్కింగ్‌కు సరిపడా స్థలం అందుబాటులో లేదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రోడ్లపై వాహనాలను నిలిపితే ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని తెలిపారు. మరోవైపు కోదాడ-జడ్చర్లను కలిపే జాతీయ రహదారి-167 రాజీవ్ చౌక్ మీదుగా వెళ్తుందని పోలీసులు గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహిస్తే జాతీయ రహదారిపై కూడా రాకపోకలకు అంతరాయం కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాజీవ్ చౌక్ పరిసరాల్లో పలు ప్రభుత్వ, ఇతర ముఖ్య కార్యాలయాలు ఉన్నందున బహిరంగ సభ వల్ల వాటి సాధారణ కార్యకలాపాలకు ఇబ్బంది కలగవచ్చని పోలీసులు తెలిపారు. ర్యాలీ, సభకు అనుమతి ఇస్తే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని పేర్కొంటూ అనుమతిని తిరస్కరించారు. అయితే ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఇతర ప్రాంతాల్లో ఫంక్షన్ హాల్, గ్రౌండ్ వంటి ప్రదేశాల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన కార్యక్రమం నిర్వహించు కునేందుకు అవకాశం కల్పిస్తామని పోలీసులు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

## స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి

ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ మెరుగైన వృద్ధి రేటు సాధించిందని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత దేశ జీడీపీ ఏకంగా 7.8 శాతం మేర వృద్ధి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు అభినందనలు చెప్పారు. 7.8 శాతం వృద్ధి రేటు నమోదవడంతో దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోందని అన్నారు. దేశ ప్రజల పట్టుదల, శక్తిసామర్థ్యాలు గొప్పవని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నా భారత్ వృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. భారత దేశ ప్రగతిని ఇలాగే కొనసాగించాల్సిన అవసరం ఉందని కూడా ప్రధాని చెప్పారు. ఆత్మనిర్భరత సాధించడం అవసరమని మరోసారి చెప్పారు. స్వదేశీ వస్తువులకు దేశ ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనవసర విదేశీ పర్యటనలు, బంగారం కొనుగోళ్లు వద్దని అన్నారు. విదేశీ మారకనిల్వల పొదుపు కోసం భారత్‌లోనే వివాహాది శుభకార్యాలు జరుపుకోవాలని సూచరించారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు అభినందనలు తెలిపిన ఆయన.. గతంలో చేసిన విజ్ఞప్తినే మరోసారి గుర్తుచేశారు. స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలని, విదేశీ ప్రయాణాలు వద్దని, అవసరం లేకుండా బంగారం కొనొద్దని మరోసారి కోరారు. ప్రస్తుతం కిర్గిస్థాన్ పర్యటనలో ఉన్న ఆయన ఈ మేరకు ఇన్‌స్టా వీడియో విడుదల చేశారు. దేశ ప్రజలకు అభినందనలు. 7.8? వృద్ధి గొప్ప విషయం. ప్రజల సంకల్ప బలం, కృషికి ఇది నిదర్శనం. ప్రపంచం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో భారత్ ఈ అసాధారణ ఘనతను దక్కించుకుంది. ప్రపంచం యుద్ధంలో మునిగిపోయింది. ఎటుచూసినా యుద్ధ వార్తలే.. సంక్షోభాలే. సరఫరా గొలుసు పూర్తిగా దెబ్బతింది. 2020లో కొవిడ్ తర్వాత నుంచి నేటి వరకు ఎక్కడా స్థిరత్వం కనిపించడం లేదు. అయినా భారత్ పురోగమిస్తోందని మోదీ తన వీడియోలో పేర్కొన్నారు. పర్యటనల కోసం విదేశాలకు వెళ్లొద్దు. విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు దూరంగా ఉండండి. 'భారత్‌లోనే వివాహం చేసుకోండి' అనే మంత్రాన్నే మనం పాటిద్దాం. అవసరం లేకపోతే బంగారాన్ని కొనడం మానుకోండి. స్థానికంగా తయారైన వస్తువులు, సేవలు ఎంత ఎక్కువగా ఎంచుకుంటే.. దేశం అంత ఎక్కువగా అభివృద్ధి చెందుతుంది. మనం స్వావలంబనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఉంటే.. స్వాతంత్య్రం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యేనాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతామనే విశ్వాసం నాకు ఉందని మోదీ పేర్కొన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా వేసిన 7 శాతం కంటే ప్రస్తుత వృద్ధి రేటు ఎక్కువ. అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా అనిశ్చితులు, ఇంధన సరఫరాకు అవరోధాలు వంటి పరిస్థితులను తట్టుకొని భారత ఆర్థిక వ్యవస్థ రాణించడం విశేషం. ఈ వృద్ధిని దేశ ప్రజలు వేడుకలా నిర్వహించుకోవాలి. అదే సమయంలో వికసిత్ భారత్ దిశగా కృషి చేయాలి. 140 కోట్ల మంది ప్రజల ఐక్యత.. దేశాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని ప్రధాని అన్నారు.

## జిడిపి వృద్ధిరేటు గణాంకాల గారడీ

### ధరలు మోత మోగిస్తుంటే..వృద్ధి ఎలా సాధ్యం

### ప్రధాని వ్యాఖ్యలపై మండిపడ్డ జైరామ్ రమేశ్

న్యూఢిల్లీ: భారత దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించిందన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలపై రాజ్యసభ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శలు గుప్పించారు. అవన్నీ ప్రచారార్భాటమేనని కొట్టిపారేశారు. గణంకాల గారడీతో మోదీ ప్రభుత్వం ప్రజలను భ్రమల్లో ముంచెత్తు తోందని ఎంపీ జైరాం రమేశ్ ఆరోపించారు. దేశంలో పెట్టుబడులు, వినియోగం మందగించాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం 'హై వోల్టేజ్' ధరల భారాన్ని సామాన్యులపై మోపుతోందని ఆరోపించారు. ముడిసరకుల ధరలు పెరగడంతో సామాన్యుల సొంతింటి కలలు కల్లలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధరాభారం కేవలం వంటింటికే పరిమితం కాలేదని అన్నారు. రాగి వైర్ ధర రూ. 850 నుంచి రూ. 1,700 కి, అల్యూమినియం ధర రూ. 350 నుంచి రూ. 650 కి చేరిందని వెల్లడించారు. 1,000 చదరపు అడుగుల ఇంటికి వైరింగ్ ఖర్చు రూ. 50 వేల నుంచి లక్ష రూపాయిలకు పెరిగిందని చెప్పారు. హోమ్ అప్లయన్సెస్, ఎల్ఈడీ లైట్లు, ఫ్యాన్లు, సోలార్ ప్యానెళ్ల ధరలు 10 నుంచి 20 శాతం వరకు పెరిగాయని అన్నారు. స్విచ్ సాకెట్లు, మెయిన్ లైన్ కేబుల్స్, టైల్స్, కార్మికులు ఖర్చు ఇలా అన్ని పెరిగాయని అన్నారు. ధరాభారం అన్ని వైపుల నుంచి ప్రజలకు షాకులిస్తోందని వ్యాఖ్యానించారు. ఇంత జరుగుతున్నా కూడా మోదీ ప్రభుత్వం మాత్రం వాస్తవాలను మరుగున పరిచి, గణాంకాలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తూ ఉందని మండిపడ్డారు. త్రైమాసిక జీడీపీ గణాంకాలు దేశంలోని పరిస్థితుల్ని తప్పుగా చూపిస్తున్నాయని అన్నారు. వీక్ సెంటిమెంట్‌ను ప్రతిఫలించట్లేదని చెప్పారు.

## భారత్‌కు మరిన్ని ఎస్-400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థ

### రష్యాతో డీల్ కుదుర్చుకోనున్న భారత్

న్యూఢిల్లీ: 'ఆపరేషన్ సిందూర్'లో సమర్థవంతంగా పనిచేసిన రష్యన్ ఎస్-400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థలకు భారత్ మరోసారి కొనుగోలు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. వీటి అవసరాలు పెంచుకోవాలని భారత రక్షణశాఖ నిర్ణయించినట్లు సమాచారం. భారత వైమానిక దళం కోసం మరో ఐదు ఎస్-400 వ్యవస్థలను కొనుగోలు చేసేందుకు జారీచేసిన టెండర్‌కు రష్యా స్పందించినట్లు సమాచారం. ఈ మేరకు 5 కొత్త వ్యవస్థలను భారత్‌కు విక్రయించేందుకు రష్యా అంగీకరించి నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. భారత సైనిక వ్యవస్థలో 'సుదర్శన్'గా పిలుస్తున్న ఎస్-400.. గతేడాది ఆపరేషన్ సిందూర్‌లో అదరగొట్టింది. శత్రువుల వైపు నుంచి వచ్చిన ప్రమాదాలను విజయవంతంగా అడ్డుకోవడంలో ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసిందని భారత రక్షణ వర్గాలు తెలిపాయి. ఎస్-400 పనితీరుకు సంబంధించి పశ్చిమ వైమానిక కమాండ్ అధిపతి ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా గతంలో ఓ పోడ్‌కాస్ట్‌లో కీలక విషయాలు వెల్లడించారు.

GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com



SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

# మరోమారు సిజెపి ఆందోళన !




కాక్రోచ్ జనతా పార్టీ మరో ఆందోళనకు సిద్ధమవుతోంది. కేంద్రం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సీజేపీ సెప్టెంబర్ 5న ఈ మార్చ్ చేపడుతోంది. గతంలో ఢిల్లీలో జరిగిన ఆందోళన సందర్భంగా కేసుల ఎత్తివేత, విద్యార్థులకు పరిహారం వంటి హామీలను కేంద్రం ప్రకటించింది. ఇదే సందర్భంలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. అయితే హామీలు అమలు చేయాలని గతకొంత కాలంగా సిజెపి డిమాండ్ చేస్తూనే ఉంది. సెప్టెంబర్ 5న ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన మార్చ్‌ను అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయం వరకు ఈ మార్చ్ నిర్వహించనున్నట్లు సీజేపీ ప్రకటించింది. ప్రస్తుతం ఈ అంశంలో న్యాయపరంగా జోక్యం చేసుకోవాల్సి నంత అత్యవసర పరిస్థితి లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే నిరసన సందర్భంగా ప్రతి ఒక్కరూ శాంతియుతంగా వ్యవహరిస్తారని ఆశిస్తున్నట్లు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఈ క్రమంలో మరోమారు ఆందోళన చేస్తే ఢిల్లీలో ఉద్రిక్తతలు నెలకొంటాయని, మార్చ్‌కు అనుమతి నిరాకరించాలని రిటైర్డ్ పోలీస్ అధికారి సుప్రీంను ఆశ్రయించారు. సెప్టెంబర్ 5న జరగనున్న నిరసన మార్చ్ శాంతిభద్రతలు, విధానపరమైన అంశాలతో ముడిపడి ఉందని సీజేఐ సూర్యకాంత్ తెలిపారు. వీటిని సంబంధిత శాంతిభద్రతల సంస్థలు, ఇతర భాగస్వాములు పరిష్కరించాల్సి ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం కోర్టు జోక్యం చేసుకోవాల్సిన బలమైన కారణాలు కనిపించడం లేదని స్పష్టం చేశారు. రిటైర్డ్ ఢిల్లీ పోలీస్ అధికారి రాజేంద్ర సింగ్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. జూలై 20న జంతర్ మంతర్ దగ్గర జరిగిన సీజేపీ నిరసన సందర్భంగా గాయపడిన పోలీసు సిబ్బందికి పరిహారం చెల్లించాలని, ప్రభుత్వ ఆస్తులకు జరిగిన నష్టాన్ని బాధ్యుల నుంచి వసూలు చేయాలని పిటిషన్‌లో కోరారు. పార్లమెంట్, ఇతర కీలక ప్రభుత్వ సంస్థలకు సమీపంలో నిర్వహించే నిరసనలకు సంబంధించి ప్రత్యేక మార్గదర్శకాలను రూపొందించాలని పిటిషనర్ కోరారు. నిరసనలు నిర్వహించకూడని ప్రాంతాలు లేదా రక్షిత ప్రాంతాలను సహేతుకమైన పరిధిలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విచారణ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది ఈ అంశానికి సంబంధించిన అనేక విషయాలను ఇంకా పరిశీలించాల్సి ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే ప్రతి అంశాన్ని సుప్రీంకోర్టు పరిశీలించలేదని సీజేఐ స్పష్టం చేశారు. ముందుగానే దీనిపై ఎలాంటి నిర్ణయాలు ప్రకటించ లేమని సుప్రీం స్పష్టం చేసింది. అలాగే నిరసనలకు సంబంధించిన అంశాలను పరిశీలించేందుకు సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన హై పవర్డ్ కమిటీని ఆశ్రయించాలని సీజేఐ సూచించారు. అన్ని అంశాలను మేము పరిశీలించలేం. ప్రతి విషయంపైనా వ్యాఖ్యానించం. మేము ఏర్పాటు చేసిన హై పవర్డ్ కమిటీని ఆశ్రయిం చండని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఒక్కో అంశాన్ని కమిటీ పరిశీలించి తమ అభిప్రాయాలను కోర్టుకు సమర్పిస్తుందని తెలిపారు. ఈ కమిటీని సీజేఐ 'తటస్థ అంపైర్'గా అభివర్ణించారు. నిరసనలకు సంబంధిం చిన విస్తృత విధానపరమైన, శాంతిభద్రతల అంశాలపై సంబంధిత వర్గాలు చర్చించు కోవాలని సూచించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 5న ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయం వరకు సీజేపీ తాజా నిరసన మార్చ్ నిర్వహించనున్నట్లు కోర్టుకు తెలియజేశారు. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు జరగనున్న విషయాన్ని పిటిషనర్ సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విదేశీ ప్రముఖులు ఢిల్లీకి రానున్న నేపథ్యంలో భద్రతా పరమైన ఆందోళనలు ఉన్నాయని, అందువల్ల నిరసన మార్చ్‌ను బ్రిక్స్ సదస్సు పూర్తయ్యే వరకు వాయిదా వేయాలని ఆయన వాదించారు. అయితే సీజేఐ స్పందిస్తూ.. 'ఇవి

శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలు. నిర్ణయం శాంతిభద్రతల సంస్థలే తీసుకోవాలి. ప్రతి ఒక్కరూ శాంతియుతంగా వ్యవహరిస్తారని మేము విశ్వసిస్తున్నాం, ఆశిస్తున్నాం. ప్రస్తుతానికి మేము జోక్యం చేసుకోవడానికి బలమైన కారణాలు కనిపించడం లేదని పేర్కొన్నారు. ఒకవేళ నిరసన సందర్భంగా ఏదైనా అవాంఛనీయ లేదా ఆందోళనకర ఘటన చోటుచేసుకుంటే.. పిటిషనర్ కొత్తగా దరఖాస్తు చేసుకుని కోర్టును ఆశ్రయించవచ్చని సీజేఐ తెలిపారు. ఈ కేసును నిరసనలు, వాటికి సంబంధించిన ఇతర అంశాలపై ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న పిటిషన్లతో కలిపి తదుపరి విచారణకు తీసుకోవాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. మొత్తంగా ఇప్పుడు సెప్టెంబర్ 5 మరోమారు చర్చనీయాంశంగా మారింది. ఢిల్లీలో ర్యాలీతో నిజంగానే శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందా అన్నదే ప్రశ్న. ఎందుకంటే గత ఆందోళనలో అసాంఘిక శక్తులు చేరాయి. ఖలిస్తాన్, ఇస్లామిక్ ఉగ్రవాదులు చేరారన్న సమాచారం ఇంటిలిజెన్స్ వద్ద ఉంది. ఈ క్రమంలో ఢిల్లీ పోలీసులు తీసుకునే నిర్ణయం కీలకం కానుంది.

# మానవత్వపు ముప్పేట సూత్రం
# మనస్సు, సత్యం, అనురాగం

**మనిషి పుట్టుక ఒక అద్భుతమైన సృష్టి పరిణామం. కానీ ఆ పుట్టుకకు అసలైన సార్థకతనిచ్చేది మనం సాగించే జీవన ప్రయాణం మాత్రమే. ఈ అనంత విశ్వంలో కొన్ని దశాబ్దాల పాటు సాగే మన జీవితం కేవలం శ్వాస తీసుకోవడం, ఆహారం తినడం, సంతానాన్ని పొందడం వంటి ప్రాథమిక అవసరాలకే పరిమితం కాకూడదు. అంతకుమించిన ఉన్నతమైన అర్థం ఏదైనా ఉందా అనే ప్రశ్నే మానవాళిని నాగరికత వైపు నడిపించింది.**



ప్రాచీన కాలం నుండి నేటి ఆధునిక అంతరిక్ష పరిశోధనల యుగం వరకు ప్రతి ఒక్కరి అంతర్మథనం ఒక్కటే, అదే సరైన జీవన మార్గం ఏది అని. శతాబ్దాలుగా తత్వవేత్తలు, విజ్ఞాన శాస్త్రవేత్తలు దీనికి సమాధానాలు వెతికారు. అనేక గ్రంథాలు నీతి సూత్రాలను బోధించగా, సాహిత్యం భావోద్వేగాల ద్వారా జీవిత పరమార్థాన్ని వివరించింది. అయితే ఈ వేగవంతమైన ప్రపంచంలో ప్రశాంతంగా, అర్థవంతంగా జీవించాలంటే మనస్సు, సత్యం, మరియు అనురాగం అనే మూడు అంశాలు అత్యంత కీలకమైనవి. మనుషుల విజయాన్ని సమాజం సాధారణంగా బయటి వస్తువులతో కొలుస్తుంది. ఇల్లు, వాహనాలు, సమాజంలో ఉండే హోదానే కొలమానంగా భావిస్తుంది. కానీ నిజమైన జీవితం కంటికి కనిపించే బాహ్య ప్రపంచంలో లేదు, మన అంతరంగంలో ఉంది. మనస్సు అనేది ఒక నిరంతర ప్రవాహం వంటిది. అది స్వచ్ఛంగా ఉంటే ప్రశాంతతను, కలుషితమైతే మానసిక అశాంతిని కలిగిస్తుంది. మనం ప్రపంచాన్ని ఏ కోణంలో చూస్తామో, అది మనకు అలాగే కనిపిస్తుంది. మనస్సు ప్రశాంతంగా ఉన్నప్పుడు ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకునే శక్తి లభిస్తుంది. కానీ నేటి సాంకేతిక యుగంలో బాహ్య సౌకర్యాల కోసం పడే తాపత్రయంలో మన అంతర్గత ఆరోగ్యాన్ని సంపూర్ణంగా విస్మరిస్తున్నాం. ఉదయం లేచింది మొదలు రాత్రి నిద్రపోయే వరకు సమాచార హోరులో కొట్టుమిట్టాడుతున్నాం. ఇతరులతో పోల్చుకోవడం, అనవసరమైన పోటీ, భవిష్యత్తు గురించిన తీవ్రమైన ఆందోళనలు మనస్సును నిరంతరం అశాంతికి గురిచేస్తున్నాయి.

మనస్సు ప్రశాంతంగా ఉండటానికి కృతజ్ఞత, క్షమాగుణం, స్వీకరించే తత్వం అవసరం. మనకు లేని వాటి గురించి బాధపడటం మానేసి, ఉన్న వాటికి విలువ ఇవ్వడమే నిజమైన తృప్తి. ఇతరుల పట్ల ద్వేషాన్ని పెంచుకోకుండా క్షమించడం ద్వారా మన మనస్సు తేలికపడుతుంది. అలాగే మన ఆధీనంలో లేని విషయాలను భారంగా కాకుండా ఒక అనుభవంగా స్వీకరించడం నేర్చుకోవాలి. ప్రశాంతమైన మనస్సు ఉన్న వ్యక్తి ఎలాంటి తుఫానులోనైనా స్థిరంగా నిలబడగలడు. ఇక రెండోది నిజాయితీ. నిజం అంటే కేవలం అబద్ధం చెప్పకపోవడం మాత్రమే కాదు, జీవితంలో పారదర్శకత కలిగి ఉండటం. చాలామంది ఇతరులతో కాకపోయినా తమతో తాము అబద్ధం చెప్పుకుంటూ బతుకుతుంటారు. మన బలహీనతలు, ఆలోచనల విషయంలో మనతో మనం నిజాయితీగా ఉండడమే మొదటి మెట్టు. మనలోని లోపాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నిస్తే అశాంతి పెరుగుతుంది. సత్యం మాట్లాడటానికి, దానిపై నిలబడటానికి ఎంతో ధైర్యం కావాలి. నిజం కొన్నిసార్లు కఠినంగా అనిపించినా, దాని పునాదులపై నిర్మించుకున్న జీవితమే చిరకాలం నిలుస్తుంది. వృత్తిపరమైన రంగంలోనైనా, వ్యక్తిగత బంధాల్లోనైనా స్పష్టత అనేది నిజాయితీ ద్వారానే వస్తుంది.

మూడోది అనురాగం లేదా ప్రేమ. మనస్సుకు శాంతి, నిజానికి ధైర్యం తోడైతే జీవితానికి పరిపూర్ణతను ఇచ్చేది ఆప్యాయతే. ఇది కేవలం ఒక బంధానికే పరిమితం కాదు, సమాజం పట్ల చూపే కరుణ. ఒకరి బాధను పంచుకోవడం, సహాయం చేయడం, ఆదరించడంలో నిజమైన ఆనందం ఉంది. నేటి కాలంలో సాంకేతికత ద్వారా ప్రపంచంతో అనుసంధానమవుతున్నా, తోటి మనుషులతో సంబంధాలు బలహీనపడుతున్నాయి. నిస్వార్థమైన అనురాగం మనుషులకే కాకుండా ప్రకృత్యంతటికీ వ్యాపించాలి. ఇతరుల పట్ల దయతో ఉండే వారిలో మానసిక ఒత్తిడి తగ్గి ఆనందం పెరుగుతుందని పరిశోధనలు కూడా చెబుతున్నాయి.

ఈ మూడు అంశాలు ఒకదానితో ఒకటి విడదీయరాని విధంగా ముడిపడి ఉన్నాయి. మనస్సు ప్రశాంతంగా ఉంటేనే నిజాయితీగా ఉండే ధైర్యం వస్తుంది, నిజాయితీ ఉన్నప్పుడే ఇతరులను పవిత్రంగా ప్రేమించగలుగుతాం. ఒక మంచి జీవితం గడపడం అంటే పెద్ద గొప్ప కార్యాలు చేయడం కాదు. ప్రతిరోజూ మన మనస్సును అదుపులో ఉంచుకోవడం, సత్యానికి కట్టుబడి ఉండటం, చుట్టూ ఉన్న వారి పట్ల ఆప్యాయత చూపడమే. మనిషిగా పుట్టడం మన చేతుల్లో లేదు కానీ, ఉత్తమ మనిషిగా జీవించడం పూర్తిగా మన చేతుల్లోనే ఉంది. అదే అసలైన మానవత్వం.



డా .సూర్యదేవర
రామకృష్ణ ,
9490754169

# కాంగ్రెస్‌లో చేరేందుకు ఎవరు ప్రయత్నించారు?

**కవిత దొంగచాటుగా కాంగ్రెస్‌లో ప్రవేశించే యత్నం చేయలేదా**

**ఎవరి స్వలాభం కోసం ఆమె విమర్శలు చేస్తున్నారో తెలుసు**

**కష్టకాలంలో మేము మాత్రమే కెసిఆర్‌ను వెన్నంటి ఉన్నాం**

**కవిత వ్యాఖ్యలపై మండిపడ్డ మాజీమంత్ంరి వేముల**



నిజామాబాద్: కాంగ్రెస్‌లో చేరేందుకు పలువురిని కలిసి రాయబేరాలు నడిపిన కవిత తనను విమర్శించడం విడ్డూరంగా ఉందని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కెసిఆర్‌కు నమ్మకబంట్లుగా ఉన్న వారిని విడదీసి పార్టీని బలహీన పర్చాలన్న ఎజెండాతో కవిత పనిచేస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై, ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై వేముల ప్రశాంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. కవితను కేసీఆర్‌ను కలపడానికి ప్రయత్నం చేసిన, విడగొట్టడానికి ప్రయత్నం చేసిన విషయం కేసీఆర్‌కు బాగా తెలుసు. పార్టీ లైన్ దాటిన తర్వాత కేసీఆర్ కవితను పార్టీ నుంచి వేటు వేశారని అన్నారు. నేను, మా తండ్రి వేముల సురేందర్‌రెడ్డి టీఆర్ఎస్ పార్టీకి వ్యవస్థాపక సభ్యులం. 2001 తెలంగాణ ఆవిర్భావానికి ముందే టీఆర్ఎస్ పార్టీలో ఉన్నాం. టీఆర్ఎస్ అంటేనే ప్రశాంత్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి అంటేనే టీఆర్ఎస్ పార్టీ. కవిత మధ్యలో వచ్చింద్రు.. మధ్యలో పోయింద్రని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీతో నేను మంతనాలు చేశానని అంటున్న కవిత.. ఇప్పుడు కష్టకాలంలో కేసీఆర్ వెంట ఉన్నది నేనా.. కవితనా? అసెంబ్లీలో, అసెంబ్లీ బయట, జిల్లాలో రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నది నేనా.. కవితనా? అని ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. లక్ష్మీనరసింహస్వామి సన్నిధానంలో ఉన్న నేను కాంగ్రెస్‌లోని ఎవరితో మంతనాలు చేయలేదు. కవిత కాంగ్రెస్‌తో మంతనాలు చేయలేదని చెప్పగలరా? కవిత రహస్యంగా కాంగ్రెస్ నాయకులతో మంతనాలు చేయలేదని చెప్పగలరా? అని ప్రశ్నించారు. నిరాధారమైన ఆరోపణలు ఎవరి లాభం కోసం కవిత చేస్తున్నారు? స్వలాభం కోసం వ్యక్తిగత ప్రతిష్టలు దెబ్బతీసే విధంగా మాట్లాడడం కరెక్ట్ కాదు. నాపై నిరాధారమైన ఆరోపణలు చేసే హక్కు కవితకు లేదని అన్నారు. మొదటి నుంచి టీఆర్ఎస్ పార్టీకి వ్యవస్థాపక సభ్యులుగా ఉన్న వారిని కవిత టార్గెట్ చేస్తున్నారు. కేసీఆర్‌కు దగ్గరగా ఉన్న వారిని కవిత టార్గెట్ చేస్తుంది. ప్రత్యక్షంగా మా నాయకత్వాన్ని బలహీనపరిచి, పరోక్షంగా అధికార పార్టీకి కవిత న్యాయం చేస్తుందని ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. కవిత సభలో కన్నీళ్లు పెట్టుకోవడంపై స్పందిస్తూ.. రాజకీయంగా సింపతిని గెయిన్ చేయడానికి అని అర్థం అవుతుంది. అది ఆమె విజ్ఞతకు వదిలేస్తున్నాం. కవిత చేసే ఈ పనుల వల్ల కేసీఆర్ ఎంత మనోవేదనకు గురవుతున్నారో బిడ్డగా ఆమె ఆలోచించడం లేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్. ఆయనపైన, కేటీఆర్‌పైన విమర్శలు చేయగా లేనిది మాపై చేయడం పెద్ద ఆశ్చర్యాన్ని కలిగించలేదు. కానీ బాధగా అనిపించింది. సొంత లాభం కోసం కవిత మాట్లాడటం పెద్ద బాధగా అనిపించలేదని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కవితను రెండుసార్లు ఎమ్మెల్సీగా చేయడంలో నా పాత్ర ఏందో కేసీఆర్‌కు బాగా తెలుసు. కవితపై మొన్నటి వరకు కేసీఆర్ బిడ్డగా గౌరవం ఉండేది. నిన్నటి మాటలతో ఆ గౌరవాన్ని కవిత పోగొట్టుకుందని వ్యాఖ్యానించారు. ఇకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం నిర్వహించారు. వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో లింబాద్రి గుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు, ప్రయోజనాలను సూచించే 'బాకీ కార్డులకు' ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆ హామీలను అమలు చేస్తామని చెప్పిందని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. 1000 రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీల్లో అనేక హామీలు నేటికీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీల ద్వారా ఎంత మేర బాకీ పడిందో ప్రజలకు తెలియజేస్తూ, ఇచ్చిన హామీలను ఇకనైనా నెరవేర్చాలని కోరుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేసేందుకు బీఆర్ఎస్ చేపట్టిన 'బాకీ కార్డుల పూజ' కార్యక్రమంలో రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు తదితర వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రజల ముందుంచారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గత పాలకుల తప్పులకు చెక్.. భూ ప్రక్షాళనకు కాంగ్రెస్ శ్రీకారం!

- ధరణి పేరుతో జరిగిన అక్రమాలకు ముగింపు.. భూభారతితో పారదర్శకత
- హైడ్రాతో ఆక్రమణల చెర నుంచి ప్రభుత్వ స్థలాలకు విముక్తి
- నారాయణపురంలో 780 మంది రైతులకు 1,337 ఎకరాల పంపిణీ
- వసంతనగర్ 22-ఏ భూముల సమస్యకు సైతం శాశ్వత పరిష్కారం
- కూకట్‌పల్లి కాంగ్రెస్ యువ నాయకుడు గాదె శివ వెల్లడి



**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 01 (క్రైమ్ మిర్రర్) :** గత ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా జరిగిన భూ వ్యవహారాలను ప్రక్షాళన చేస్తూ, ప్రతి ఒక్కరికీ చట్టబద్ధమైన హక్కులు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పకడ్బందీగా అడుగులు వేస్తోందని కూకట్‌పల్లి కాంగ్రెస్ యువ నాయకుడు, వసంతనగర్ డివిజన్ నేత గాదె శివ స్పష్టం చేశారు. ఫారెస్ట్, అసైన్డ్, ప్రభుత్వ భూములను నిబంధనలకు విరుద్ధంగా మార్చుకుని, ధరణి రికార్డుల్లో చేర్చి రైతుబంధును సైతం అక్రమంగా పొందారని ఆయన గత పాలకుల తీరుపై మండిపడ్డారు. దళితులకు మూడు ఎకరాలు, రైతు రుణమాఫీ అని చెప్పి గత ప్రభుత్వం ప్రజలను దారుణంగా మోసం చేసిందని ఆయన విమర్శించారు.

**ప్రజల భూమి ప్రజల హక్కు**

ప్రజల భూమి ప్రజల హక్కు అనే సిద్ధాంతంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని శివ తెలిపారు. గతంలో అవసరాల కోసం కేటాయించిన స్థలాలు ఆక్రమణలకు గురైతే, వాటిని హైడ్రా ద్వారా తిరిగి ప్రజా వినియోగంలోకి తీసుకువచ్చే బృహత్తర కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ధరణి రికార్డులను రద్దు చేసి, భూభారతి ద్వారా భూ రికార్డులను ప్రక్షాళన చేసి నిజమైన హక్కుదారులకు న్యాయం జరిగేలా సర్కారు కృషి చేస్తోందని పేర్కొన్నారు.

**అమలైన నారాయణపురం రైతుల కల**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అనడానికి మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం రైతుల కలను నెరవేర్చడమే నిదర్శనమని శివ గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2017లో చేపట్టిన భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా నారాయణపురం గ్రామంలోని భూములన్నింటినీ ధరణి కారణంగా ఫారెస్ట్ జాబితాలో చేర్చారు. దీంతో ఏళ్ల తరబడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ సమస్యను పరిష్కరించి, 780 మంది రైతులకు ఏకంగా 1,337 ఎకరాలకు సంబంధించిన పట్టాదార్ పాస్ పుస్తకాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క స్వయంగా అందజేశారు. దశలవారీగా భూ సర్వే చేపట్టి క్యూఆర్ కోడ్‌తో కూడిన పట్టా బుక్ అందజేస్తామని మంత్రి పొంగులేటి ఆ సభలో స్పష్టం చేశారు.

**వసంతనగర్ భూములపై స్పష్టమైన హామీ**

వసంతనగర్ భూముల విషయంలోనూ ప్రజల హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని గాదె శివ భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలోనే ఈ భూములకు అడ్డంకులు ఏర్పడ్డాయని, వీటిని 22ఏ జాబితాలో చేర్చిన పాపం గత పాలకులదేనని విమర్శించారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ సమక్షంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. వసంతనగర్ భూముల సమస్యను పరిష్కరిస్తామని ప్రజలకు స్పష్టమైన హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ రైతు రుణమాఫీ అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. హామీ అంటే కాంగ్రెస్ హామీ అమలు అంటే కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆయన అభివర్ణించారు. అక్రమాలు, అన్యాయాలకు ముగింపు పలికి నిజమైన హక్కుదారులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని, వసంతనగర్ ప్రజలంతా కాంగ్రెస్ ఇన్‌ఛార్జి బండి రమేష్ వెంట నడవాలని గాదె శివ పిలుపునిచ్చారు.

# ఫతేనగర్ ఫ్లైఓవర్‌కు అత్యవసర మరమ్మతులు చేపట్టాలి

**పెండింగ్‌లో ఉన్న పెన్షన్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి**

**ఫతేనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు క్రాంతి ముదిరాజ్**





**బాలానగర్, సెప్టెంబర్ 01 (క్రైమ్ మిర్రర్):** మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోయినపల్లి సర్కిల్ ఫతేనగర్ డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఫతేనగర్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బోయిన్‌పల్లి జోన్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ ధాకు నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈమేరకు ప్రధానంగా ఫతేనగర్ ఫ్లైఓవర్‌పై అత్యవసర రోడ్డు మరమ్మతు పనులను చేపట్టాలని, అలాగే ఫతేనగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పెన్షన్ దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ఆమోదించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఫ్లైఓవర్‌పై రహదారి పరిస్థితి కారణంగా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మరమ్మతులను ఆలస్యం చేయకుండా చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు సమర్పించిన వినతిపత్రంపై డిప్యూటీ కమిషనర్ ధాకు నాయక్ సానుకూలంగా స్పందించారు. ఫతేనగర్ ఫ్లైఓవర్ మరమ్మతు పనులతో పాటు పెండింగ్‌లో ఉన్న పెన్షన్ దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఫతేనగర్ డివిజన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కె. క్రాంతి ముదిరాజ్ నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఓబీసీ సమన్వయకర్త కె. రాజు ముదిరాజ్, ఏఎంసీ డైరెక్టర్ మద్దూరి రాము, ఐజాజ్, యువజన కాంగ్రెస్ నాయకుడు ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతామని కాంగ్రెస్ డివిజన్ నాయకులు తెలిపారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే కాలే యాదయ్య

**క్రైమ్ మిర్రర్ శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మండల ఎంపీడీవో కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులతో పాటు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మండలంలోని 45 మంది లబ్ధిదారులకు రూ.23 లక్షల 50 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే కాలే యాదయ్య పంపిణీ చేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. పర్వేద సర్పంచ్ సురేందర్ గౌడ్ మాట్లాడుతూ.. పేదలు, ఆపదలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సహాయ కార్యక్రమాలు అభినందనీయమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రజాప్రతినిధులు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.






# తెలంగాణ ఐస్ స్టార్ ప్రణవ్ మాధవ్ సురపనేని ఘనత..

**17 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్న యువ షార్ట్ ట్రాక్ స్పీడ్ స్కేటర్..**



**క్రైమ్ మిర్రర్ మియాపూర్ ప్రతినిధి..** తెలంగాణ ప్రభుత్వ పశుసంవర్ధక, డెయిరీ అభివృద్ధి, మత్స్య, క్రీడలు మరియు యువజన సేవల శాఖల మంత్రి వాకిటి శ్రీహరి ని తెలంగాణ సెక్రటేరియట్‌లో యువ షార్ట్ ట్రాక్ స్పీడ్ ఐస్ స్కేటర్ ప్రణవ్ మాధవ్ సురపనేని, ఆయన తల్లిదండ్రులు రఘు కవిత దంపతులు మియాపూర్ డివిజన్ నాయకులు, యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు , చైర్మన్ యలమంచి ఉదయ్ కిరణ్ , అలాగే శ్రీమతి నవ్యశ్రీ , శశి మర్యాదపూర్వకంగా కలిశారు. కేవలం 17 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో అద్భుత ప్రతిభను కనబరుస్తూ తెలంగాణతో పాటు భారతదేశానికి గర్వకారణంగా నిలుస్తున్న ప్రణవ్ మాధవ్ సురపనేని సాధించిన విజయాలను ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి అభినందించారు. ఏషియన్ ఓపెన్ షార్ట్ ట్రాక్ ఛాంపియన్‌షిప్ 2026 -- డెహ్రాడూన్‌ప్రణవ్ ఈ ప్రతిష్టాత్మక పోటీల్లో మూడు పతకాలను సాధించారు.1000 మీటర్ల విభాగంలో రజత పతకం 500 మీటర్ల విభాగంలో కాంస్య పతకం మెన్స్ రిలేలో కాంస్య పతకం. ప్రణవ్ సాధించిన ఇతర ఘనతలు మల్టిపుల్ టైమ్ నేషనల్ ఛాంపియన్‌షిప్ గోల్డ్ మెడలిస్ట్, వరల్డ్ జూనియర్ కప్స్ మరియు వరల్డ్ జూనియర్ ఛాంపియన్‌షిప్స్‌కు అర్హత కేవలం 17 ఏళ్ల వయసులోనే సీనియర్ వరల్డ్ టూర్‌కు అర్హత.. 2030 ఒలింపిక్స్‌లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించాలనే లక్ష్యం ఈ సందర్భంగా ప్రణవ్ మాధవ్ సురపనేనిని ఘనంగా అభినందించి, శాలువాతో సత్కరించారు. క్రీడల పట్ల ఆయన చూపుతున్న అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదల మరియు ప్రతిభకు సాధించిన విజయాలు నిదర్శనమని పేర్కొన్నారు.తెలంగాణ నేల నుంచి అంతర్జాతీయ ఐస్ స్కేటింగ్ వేదిక వరకు ప్రణవ్ సాగిస్తున్న ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. యువ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహించి, వారికి అవసరమైన అవకాశాలు మరియు సహకారం అందిస్తే అంతర్జాతీయ స్థాయిలో దేశానికి మరిన్ని పతకాలు సాధించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ప్రణవ్ వంటి యువ ప్రతిభావంతులు తెలంగాణ క్రీడా రంగానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి తెలంగాణకు, భారతదేశానికి మరింత కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఉదయ్ కిరణ్ ఆకాంక్షించారు.



# గుంటూరు మిర్చి యార్డ్ సందర్శించిన పెబ్బేరు కాంగ్రెస్ నాయకులు

**వనపర్తి సెప్టెంబర్ 01 క్రైమ్ మిర్రర్:** వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో స్టడీ టూర్ కార్యక్రమంలో భాగంగా పాలకవర్గ సభ్యులు ఆంధ్రప్రదేశ్ జిల్లాలోని గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీని సందర్శించారు. అక్కడ మిర్చి యార్డ్ ను పరిశీలించి, రైతులకు లాభసాటిగా పంటల కొనుగోలు విధానం,ఈ-నామ్ ద్వారా వేలం వేసే పద్ధతులను అడిగి తెలుసుకున్నారు.ఈ అధ్యయనం పెబ్బేరు మార్కెట్ అభివృద్ధికి ఉపయోగపడుతుందని మార్కెట్ వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్,మార్కెట్ డైరెక్టర్లు మోతే రాములు,నరసింహనాయుడు,రామన్ గౌడ్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు యుగంధర్ రెడ్డి,వెంకటేష్ సాగర్, సురేందర్ గౌడ్ బూరమోని రాములు,భాను ప్రకాష్ రెడ్డి,సురేందర్ గౌడ్,రాములు తదితరులు పాల్గొన్నారు

# ఎస్ఐఆర్‌లో భాగంగా ఓటర్లకు నోటీసుల పంపిణీ.. పర్యవేక్షించిన గొట్టిముక్కల వెంకటేశ్వరరావు



**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 01 (క్రైమ్ మిర్రర్) :** కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లకు నోటీసుల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. కూకట్‌పల్లి, ప్రశాంత్‌నగర్ డివిజన్లలో చేపట్టిన నోటీసుల పంపిణీ కార్యక్రమాన్ని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు (జీ.వీ.ఆర్.) పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లకు అందజేస్తున్న నోటీసుల పంపిణీ తీరును పరిశీలించి, కార్యక్రమం సజావుగా జరిగేలా నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఓటర్లు తమకు అందిన నోటీసులను పరిశీలించి, అవసరమైన వివరాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షణకు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని జీ.వీ.ఆర్. పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షులు కావేటి నాగార్జున, ప్రశాంత్‌నగర్ డివిజన్ అధ్యక్షులు చందర్‌రావు, ఫాల్గుణరావు, మేకల సుదర్శన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలపై నిరసన కార్యక్రమాలు

**నేటి నుండి డివిజన్ స్థాయిలో ప్రజాక్షేత్రంలో పోరాటం**

**బిఆర్ఎస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన కోఆర్డినేటర్ సతీష్ అరోరా**



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 01 (క్రైమ్ మిర్రర్) :** కాంగ్రెస్ పార్టీ 420 హామీలు, బూటకపు 6 గ్యారంటీలు పై బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు, డివిజన్ స్థాయి సమావేశాలతో ప్రజా క్షేత్రం లో పోరాటం చేస్తున్నట్టు బిఆర్ఎస్ పార్టీ కూకట్ పల్లి నియోజకవర్గం కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా తెలిపారు. నేటి నుండి జరుగు డివిజన్ స్థాయి ప్రజా సమావేశాలకు కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్యఅతిథిగా విచ్చేస్తారని ఆయన తెలిపారు. ఈ సమావేశాలు మాజీ కార్పొరేటర్ ల ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి సమావేశాలు జరుగుతాయని ఆయన తెలిపారు. ఈ డివిజన్ స్థాయి సమావేశాలు నేడు బోయినపల్లి డివిజన్లో, సెప్టెంబర్ 4 బాలానగర్ డివిజన్లో, సెప్టెంబర్ 5 బేగంపేట డివిజన్లో, సెప్టెంబర్ 6 ఫతేనగర్ డివిజన్ లో, సెప్టెంబర్ 7 మూసాపేట్ డివిజన్లో, సెప్టెంబర్ 8 అల్లాపూర్ డివిజన్లో, సెప్టెంబర్ 9 బాలాజీ నగర్, కె పి హెచ్ బి డివిజన్లు కలిపి, సెప్టెంబర్ 10 కూకట్ పల్ల డివిజన్లో జరుగుతాయని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలు బూటకపు 6 గ్యారంటీలు పై జరుగు ప్రజా పోరాటానికి డివిజన్ స్థాయిలో మద్దతు కూడా కట్టి భారీ ఎత్తున నిరసనలు తెలుపుతూ కాంగ్రెస్ బూటకపు హామీలపై ఇంటింటికి బాకీ కార్డులు చేరే విధంగా చేసి ప్రజలను చైతన్య పరచాలని ఆయన పిలుపునిచ్చారు.

# మైనారిటీ మహిళలకు రూ.50 వేల ఆర్థిక చేయూత

## ఇందిరమ్మ మైనారిటీ మహిళ యోజన పథకం కింద కూకట్ పల్లి నియోజకవర్గ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

## మైనార్టీ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యం..రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు







**కూకట్ పల్లి, సెప్టెంబర్ 01 (క్రైమ్ మిర్రర్) :** మైనారిటీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ మైనారిటీ మహిళ యోజన పథకం కింద కూకట్ పల్లి నియోజకవర్గానికి చెందిన అర్హులైన మహిళలకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందింది. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ ఆర్థిక సహాయంతో మైనారిటీ మహిళలు చిన్నతరహా వ్యాపారాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం ఏర్పడుతుందని అధికారులు పేర్కొన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుచుకోవడంతో పాటు మహిళలు స్వతంత్రంగా ఆదాయం పొందేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందని తెలిపారు.

**బండి రమేష్ ప్రత్యేక చొరవ**

కూకట్ పల్లి నియోజకవర్గంలోని మైనారిటీ మహిళలకు ఈ పథకం ద్వారా ప్రయోజనం కల్పించడంలో కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అర్హులైన మహిళలను గుర్తించడం, వారికి పథకం వివరాలను తెలియజేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకం ద్వారా లబ్ధి చేకూరేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేయడంలో ఆయన కృషి చేశారు. మైనారిటీ మహిళలకు ఆర్థికంగా అండగా నిలవడం ద్వారా వారి కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలను పెంచాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. రూ.50 వేల ఆర్థిక సహాయం అందుకోవడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. తమకు ఆర్థికంగా అండగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వానికి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు, పథకం ద్వారా ప్రయోజనం అందేలా కృషి చేసిన బండి రమేష్ కి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుష్ప రెడ్డి, వాజిద్ భాష, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

# కూకట్ పల్లి ఎమ్మెల్యే పాదయాత్రను అడ్డుకోండి

## పది సంవత్సరాల కాలంలో బిఆర్ఎస్ కార్పొరేటర్లు బాలానగర్ డివిజన్ కు ప్రాతినిధ్యం

## ఓల్డ్ విలేజ్ లోని వెటర్నరీ, లైబ్రరీ ఉన్న పాత భవనాన్ని నిర్మించలేకపోయారని తీవ్ర విమర్శ

## కాంగ్రెస్ నేత మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి పిలుపు



**బాలానగర్, సెప్టెంబర్ 01 (క్రైమ్ మిర్రర్) :** నేటి నుండి కూకట్ పల్లి నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తున్న కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును ప్రజలు అడ్డుకోవాలని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి పిలుపు నిచ్చారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే భూములను 22ఎ నిషేధిత జాబితాలో పెట్టడం జరిగిందని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీపై నిందలు వేయడం కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు సరికాదని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిఆర్ఎస్ పార్టీ చేసిన పాపమే నేడు అమాయక ప్రజలు తీవ్రంగా బాధపడుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కేవలం మాటలకే పరిమితం అయ్యారని, ఆయన చేసిన అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదని పేర్కొన్నారు. పాదయాత్ర పేరుతో బస్తీల్లో ఎంత తిరిగినా ఇప్పుడు ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా చెప్పుకోవడమే తప్ప చేసింది ఏమీ లేదని పేర్కొన్నారు. బాలానగర్ డివిజన్ లో సాయినగర్, వినాయకనగర్ ప్రాంతాల్లోని నాలాకు రిటైనింగ్ వాల్ ఇప్పటి వరకు నిర్మించక పోవడం విడ్డూరం అని పేర్కొన్నారు. రెండు సార్లు బాలానగర్ డివిజన్ కు బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు ప్రాతినిధ్యం వహించారు కానీ ఆ కాలంలో అంటే 10 సంవత్సరాలు బాలానగర్ ఓల్డ్ విలేజ్ లోని వెటర్నరీ, లైబ్రరీ ఉన్న పాత భవనాన్ని నిర్మించలేకపోయారని తీవ్రంగా విమర్శించారు.

# నకిరేకల్‌లో భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలి



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నివాసంలో నిర్వహించారు. సెప్టెంబర్ 5న నకిరేకల్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొనే భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు.నకిరేకల్ అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలతో పాటు నిర్వహించే సభకు ఉరుమడ్ల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చేలా కృషి చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పిలుపు మేరకు సభను విజయవంతం చేయాలని నాయకులు కోరారు. సమావేశంలో సర్పంచ్ సాగర్ల భానుశ్రీ భిక్షం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కోనేటి యాదగిరి, ఉద్యమకారుల వేదిక జిల్లా అధ్యక్షుడు పల్లపు బుద్ధుడు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు చెరుకు సైదులు, ఉపసర్పంచ్ ఉయ్యాల నరేష్ గౌడ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తాళం వేసి ఉంచిన ఒంటరి మహిళ ఇంట్లో చోరీ



**క్రైమ్ మిర్రర్ శంకర్‌పల్లి:** తాళం వేసి ఉంచిన ఓ ఒంటరి మహిళ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అయ్యప్పరెడ్డిగూడ, శంకర్‌పల్లి నివాసి పంకంటి సరస్వతి (55) ఆగస్టు 30న రాఖీ పండుగ సందర్భంగా మోమిన్‌పేట్‌లోని దుర్గంచెరువు గ్రామంలో ఉన్న తన కుమార్తె, అల్లుడి వద్దకు వెళ్లారు. ఇంటికి తాళం వేసి వెళ్లారు.సెప్టెంబర్ 1 ఉదయం సుమారు 9:30 గంటల సమయంలో పక్కింటి వారు ఫోన్ చేసి ఇంట్లో దొంగతనం జరిగిన విషయాన్ని ఆమెకు తెలియజేశారు. వెంటనే ఇంటికి చేరుకున్న సరస్వతి ఇంటిని పరిశీలించగా.. ఇంట్లో భద్రపరిచిన 3 తులాల బంగారం, సుమారు 30 తులాల వెండి, కొంత నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు.బాధితురాలి ఫిర్యాదు మేరకు శంకర్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించేందుకు పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు.ఎస్‌హెచ్ఓ, శంకర్‌పల్లి

# ఇందిరమ్మరాజ్యం ప్రగతిపథంలో వెయ్యి రోజులు విజయవంతంగా పూర్తి చేసుకుంది

## తెలంగాణలో ప్రజాప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తవుతున్న శుభవేళ రాష్ట్రంలో ఒక కీలక మైలురాయి ఆవిష్కృతమైంది

## పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం




**కూకట్ పల్లి, సెప్టెంబర్ 01 (క్రైమ్ మిర్రర్) :** తెలంగాణలో కాంగ్రెస్ సర్కారు వెయ్యి రోజుల సుపరిపాలనను పూర్తి చేస్తుందని పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. ఈ సందర్భంగా గాంధీభవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సత్యం శ్రీరంగం మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం పాలనతో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసుకుంటున్న వెయ్యి రోజులు కేవలం పాలనా ఒక మైలురాయి మాత్రమే కాదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు, సంక్షేమ కార్యక్రమాల విస్తరణ, రైతులు, మహిళలు, యువత, బడుగు బలహీన వర్గాల పేదలపై ప్రత్యేక దృష్టితో పాటు మౌలిక వసతులు,పెట్టుబడులు, పారిశ్రామికాభివృద్ధికి ప్రాధాన్యతిచ్చిన కాలంగా వెయ్యి రోజుల పాలనను చూడవచ్చు అని అన్నారు. 2023 డిసెంబర్ 7న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలన, సంక్షేమం, వ్యవసాయం, ఉపాధి, మహిళా సాధికారత, విద్య, వైద్యం, అభివృద్ధి, మౌలిక వసతులు, పారిశ్రామికాభివృద్ధి రంగాలకు ప్రాధాన్యతిస్తూ 'తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యంగా రాష్ట్రం దూసుకుపోతోంది. ఇచ్చిన హామీలు అమలుచేస్తూ సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమతూకంగా ముందుకు తీసుకెళ్తుందని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, అమలుచేస్తున్న పథకాలతో ప్రజలు పూర్తి సంతృప్తిగా ఉన్నారని స్పష్టమవుతోందని, రాష్ట్రం ఏర్పడేనాటికి మిగులు బడ్జెట్గా ఉన్న తెలంగాణ తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో అప్పుల మయంగా మారి ఆర్థికంగా పలు సవాళ్లు ఎదురవుతున్నా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యతిచ్చింది అన్నారు. మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యతిస్తూ మహా లక్ష్మి పథకంలో భాగంగా సోనియా గాంధీ పుట్టిన రోజు సందర్భంగా 2023 డిసెంబర్ 9వ తేదీన మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించి 30 నెలల్లో ప్రభుత్వం రూ.11 వేల కోట్ల మేర ఖర్చు చేయడంతో స్త్రీలకు ప్రత్యక్ష ఆర్థిక ప్రయోజనం కలిగింది. అంతేకాక, మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం రూ.27 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు అందించింది. మహిళా సంఘాల ఆధ్వర్యంలో బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా ఆర్థిక కార్యకలాపాల్లో భాగస్వాములుగా తీర్చిదిద్దింది. 70 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు నిరుపేద కుటుంబాలకు సొంత ఇల్లు కల్పించాలనే లక్ష ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 4.5 లక్షల కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేసింది. పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థికభారాన్ని తగ్గించేందుకు గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడంతోపాటు రూ.500కే ఎల్పీజీ సిలిండర్ పంపిణీ చేస్తోంది అన్నారు. దీర్ఘకాలంగా రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న పేదల ఆశలను నెర వేర్చే దిశగా ప్రభుత్వం 16.32 లక్షల కొత్త కార్డులు జారీ చేయడంతో రాష్ట్రంలో 1.06 కోట్ల ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43 కోట్ల మందికి ప్రయోజనం చేకూ రుతోంది.పేదల ఆహార భద్రతను మరింత బలోపేతం చేసే చర్యల్లో భాగంగా దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో ఉచితంగా సన్నబియ్యం అందించే కార్యక్రమాన్ని చేపట్టడం చారిత్రాత్మకం అని అన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో తమ ఆకాంక్షలు నెరవేరుతాయని ఆశించి భంగపడ్డ తెలంగాణ యువతలో విశ్వాసం కలిగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం70 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేసిందన్నారు. విద్యార్థుల పోషకాహారంపై దృష్టి పెడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో అల్పాహారం ప్రారంభించింది. రాష్ట్రంలో 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టి ప్రభుత్వం విద్యా వ్యవస్థ బలోపేతానికి నడుం బిగించింది. భారీ పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాల రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ తో ముందుకుసాగుతూ 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చి దిద్దడం లక్ష్యంగా పెట్టుకుంది. గ్లోబల్ ఇన్వెస్టర్లను ఆకర్షించడంతోపాటు తెలంగాణను ప్రపంచ స్థాయి పారిశ్రామిక, సాంకేతిక కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. కేంద్రం వివక్ష ధోరణి ప్రభుత్వాన్ని విమర్శించడమే లక్ష్యంగా ప్రతిపక్షాలు బీఆర్ఎస్, బీజేపీ వ్యవహరించడం దురదృష్టకరం. రెండు దఫాల పదేండ్ల కేసీఆర్ పాలనలో సాధించని అభివృద్ధి వెయ్యి రోజుల రేవంత్ రెడ్డి పాలనలో పూర్త వడంతో ఇక ప్రజలు తమను ఆదరించరనే అసహనం బీఆర్ఎస్ లో నెలకొంది అని, కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తికి తూట్లు పొడుస్తూ తెలం గాణపై వివక్ష చూపించడం దురదృష్టకరం. రాష్ట్రానికి న్యాయంగా దక్కాల్సిన నిధులు, ప్రాజెక్టులు, విభజన హామీలను తొక్కిపెట్టకుండా కేంద్రం నుంచి రాష్ట్రానికి సహాయ సహకారాలందితే తెలంగాణ రాష్ట్రాభివృద్ధి మరింత వేగవంతంగా అభివృద్ధి చెందుతుంది. ప్రతిప క్షాలు ఎన్ని అవాస్తవాలు ప్రచారం చేసినా కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజు రోజుకూ ప్రజాదరణ పెరుగుతుండడంతో తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడమే కాకుండా, రాహుల్ గాంధీ దేశ ప్రధాన మంత్రి కావడం కూడా ఖాయం అని అన్నారు.



## ఐ అండ్ పీఆర్ జేడీ జగన్‌కు అభినందనలు తెలియజేసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు

**హైదరాబాద్(క్రైమ్ మిర్రర్)** రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ అడిషనల్ డైరెక్టర్ గా పదోన్నతి పొందిన జాయింట్ డైరెక్టర్ డి ఎస్ జగన్ కు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అభినందనలు తెలియజేశారు. మంగళవారం ఆయన పలువురు ఫెడరేషన్ నాయకులతో కలిసి మాసబ్ ట్యాంక్ లోని సమాచార భవన్ (ఐఅండ్ పీఆర్ కార్యాలయం) లో జగన్ ను కలిసి పూలబొక్కే అందజేసి అభినందనలు తెలియజేశారు. సోమయ్యతో పాటు ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, జాతీయ కౌన్సిల్ సభ్యులు కుంచం శ్రీనివాస్, యర్రమిల్లి రామారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పాండురంగారావు, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ రవికుమార్, రంగారెడ్డి జిల్లా నాయకులు నంబి పర్వతాలు, గోవింద్ నాయక్, రవికుమార్ తదితరులు నూతన అడిషనల్ డైరెక్టర్ జగన్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, సమాచార శాఖలో వివిధ హోదాల్లో పనిచేసిన డిఎస్ జగన్ కు డిప్యూటీ డైరెక్టర్ గా పదోన్నతి లభించడం అభినందనీయమని అన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన ఈ సందర్భంగా జగన్ దృష్టికి తీసుకువెళ్ళి త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

# సీఎం సభ విజయవంతం చేయాలి

## చిట్యాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎద్దులపూరి కృష్ణ



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** 5న నకిరేకల్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు చిట్యాల పట్టణం నుంచి 4,500 మంది జన సమీకరణ చేయాలని నిర్ణయించారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం ఆదేశాల మేరకు 3, 5, 10, 12 వార్డుల్లో సమావేశాలు నిర్వహించారు.చిట్యాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎద్దులపూరి కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశాల్లో మున్సిపల్ చైర్మన్ పందిరి గీతా రమేష్, వైస్ చైర్మన్ గుండెబోయిన లక్ష్మి సైదులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జడల చిన్నమల్లయ్య, వనమా వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ ప్రమాదంలో రైతు మృతి

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామానికి చెందిన సింగిరెడ్డి కృష్ణారెడ్డి (43) ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందాడు. సోమవారం రాత్రి తన పొలం వద్ద ఉన్న ట్రాక్టర్‌ను కౌలు పొలం వద్దకు తీసుకెళ్తుండగా, పొలాల బాటలో మలుపు తిప్పే క్రమంలో ట్రాక్టర్ మట్టి గడ్డపై నుంచి జారిపడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ వెనుక టైర్ కిందపడి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.మృతుడి భార్య సింగిరెడ్డి శోభ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిట్యాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.



# జర్నలిస్టులపై దాడులు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం

దళిత జర్నలిస్టుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కాషాపోగు జాన్

దళిత జర్నలిస్టు రాములుపై దాడిని ఖండించిన నాయకులు

కౌంటర్ కేసులతో వేధింపులు ఆపాలి

అంబేద్కర్ అభయహస్తం కింద రూ.12 లక్షలు ఇవ్వాలి

ఇళ్ల స్థలాలు, ఉచిత బస్సు పాస్‌లు, హెల్త్ కార్డులు మంజూరు చేయాలి

దళిత జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఉద్యమం

సంఘాన్ని మరింత బలోపేతం చేస్తాం: రామని అశోక్

డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం: యాదగిరి





**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 01:** ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చే జర్నలిస్టులపై దాడులు జరగడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతమని దళిత జర్నలిస్టుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కాషాపోగు జాన్ అన్నారు. ముఖ్యంగా దళిత జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, బెదిరింపులు, కౌంటర్ కేసులతో వేధింపులను అరికట్టేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా దళిత జర్నలిస్టుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కాషాపోగు జాన్, రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా రామని అశోక్ ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, సంగారెడ్డి నియోజకవర్గ అధ్యక్షుడిగా కందుకూరి కృష్ణను నియమించారు. నారాయణఖేడ్ ప్రాంతంలోని మనూర్ మండలం అతిమెల్ పాఠశాలలో దళిత జర్నలిస్టు రాములుపై జరిగిన దాడి ఘటనను నాయకులు ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రజలకు సమాచారం అందించే జర్నలిస్టుపై దాడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు, సమాజానికి విలువలు బోధించాల్సిన ఉపాధ్యాయుడే జర్నలిస్టుపై దాడికి పాల్పడినట్లు ఆరోపణలు రావడం ఆందోళనకరమన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడికి గురైన జర్నలిస్టులపై తిరిగి కౌంటర్ కేసులు నమోదు చేసి వేధించే విధానాన్ని అరికట్టాలని కోరారు. దళిత జర్నలిస్టుల ఆర్థిక, సామాజిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ చర్యలు చేపట్టాలని నాయకులు కోరారు. అంబేద్కర్ అభయహస్తం పథకం కింద అర్హులైన దళిత జర్నలిస్టులకు రూ.12 లక్షల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

ఇల్లు లేదా ఇంటి స్థలం లేని దళిత జర్నలిస్టులను గుర్తించి ఇళ్ల స్థలాలు, ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. విధి నిర్వహణలో నిరంతరం ప్రయాణించే జర్నలిస్టులకు ఉచిత బస్సు పాస్‌లు, జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నూతన జిల్లా అధ్యక్షుడు గా ఎన్నికైన రామని అశోక్ మాట్లాడుతూ.. జిల్లాలోని దళిత జర్నలిస్టులందరినీ సమన్వయం చేసుకుంటూ వారి హక్కులు, సంక్షేమం కోసం పనిచేస్తానన్నారు. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అవసరమైన సందర్భాల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ.. దళిత జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. జర్నలిస్టులపై దాడులు ఆగే వరకు, వేధింపులు మరియు కౌంటర్ కేసుల సంస్కృతికి అడ్డుకట్ట పడే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నకుమార్, ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు రాపాక విజయరాజు, సీనియర్ జర్నలిస్టులు విలాస్, రాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నారం 117 ఎకరాల భూముల స్వాధీనం యత్నాన్ని విరమించాలి

లబ్ధిదారుల హక్కులను కాపాడాలి: తెలంగాణ రాజ్యాధికార పార్టీ



**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 01:** సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం అన్నారం గ్రామంలోని సర్వే నెంబర్ 261/1లో ఉన్న 117 ఎకరాల భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ డిమాండ్ చేసింది. 1984లో ప్రభుత్వం ఈ భూములను అర్హులైన లబ్ధిదారులకు ఒక్కొక్కరికి ఒక ఎకరం చొప్పున పంపిణీ చేసిందని పార్టీ నాయకులు తెలిపారు. అప్పటి నుంచి లబ్ధిదారులు భూములను సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. లబ్ధిదారుల వద్ద పాత పట్టాదారు పాస్ పుస్తకాలు ఉన్నప్పటికీ, గత ప్రభుత్వ హయాంలో కేవలం 30 మందికి మాత్రమే కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చి, మిగిలిన అర్హులకు ఇవ్వకుండా అన్యాయం చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి వెంటనే కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేయాలని, దశాబ్దాలుగా వారి ఆధీనంలో ఉన్న భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారుల హక్కులను పరిరక్షించకపోతే బాధితులతో కలిసి తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి నాగేష్, రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రవి, నర్సాపూర్ ఇంచార్జి రాములు తదితరులు పాల్గొన్నారు.

## హైదర్‌షాకోట్‌లో ఎస్ఐఆర్ హియరింగ్

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా హైదర్‌షాకోట్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హియరింగ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని రాజేంద్రనగర్ డీసీ-19, ఏఈఆర్ఓ సురేందర్ రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాకు సంబంధించిన అభ్యంతరాలు, అభ్యర్థనలు స్వీకరించి పరిశీలించారు. అర్హులైన ఓటర్ల వివరాలు జాబితాలో సక్రమంగా ఉండేలా అధికారులు చర్యలు చేపట్టారు.








## పటాన్‌చెరు లో డిజె ఫ్రీ గణేష్ ఉత్సవాలు: సీఐ రవీందర్

ఆన్‌లైన్ పోలీస్ పర్మిషన్ తప్పనిసరి, రోడ్లను పూర్తిగా మూసివేస్తే చర్యలు

ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఏర్పాట్లు

హైకోర్టు ఉత్తర్వులు తప్పనిసరిగా పాటించాలి

మండపాల నిర్వహణ బాధ్యత నిర్వాహకులదే

ఈ నెల 14 నుంచి పోలీసు సిబ్బంది అందుబాటులో

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 01:** రానున్న గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పోలీసు శాఖ కఠిన నిబంధనలు అమలు చేయనుంది. డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని పటాన్‌చెరు సీఐ రవీందర్ స్పష్టం చేశారు. మంగళవారం పటాన్‌చెరులోని ముదిరాజ్ భవన్ కమ్యూనిటీ హాల్లో సీఐ రవీందర్ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గణేష్ మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పోలీసులు పలు కీలక సూచనలు, నిబంధనలను వివరించారు. గణేష్ మండపాలను ఏర్పాటు చేసే నిర్వాహకులందరూ తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారా పోలీసు శాఖ నుంచి అనుమతులు పొందాలని సీఐ రవీందర్ సూచించారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు డీజేలు, డీజే మిక్సర్ల వినియోగానికి ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు. అయితే డీజే మిక్సర్ లేకుండా ప్యాడ్ బ్యాండ్‌ను వినియోగించుకోవచ్చని సూచించారు. గణేష్ మండపాల ఏర్పాటు పేరుతో రహదారులను పూర్తిగా మూసివేయరాదని, ప్రజలు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా మండపాల ఏర్పాటు, ఉత్సవాల నిర్వహణ ఉండాలని పేర్కొన్నారు. ఈ నెల 14వ తేదీ నుంచి గణేష్ ఉత్సవాలకు సంబంధించి పోలీసు సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా రాత్రి 11 గంటల వరకు మాత్రమే ప్యాడ్ బ్యాండ్ ను వినియోగించాలని స్పష్టం చేశారు. గణేష్ మండపాల నిర్వహణ, శాంతిభద్రతల పరిరక్షణ, పోలీసు శాఖ నిబంధనల అమలు విషయంలో పూర్తి బాధ్యత ఆయా మండపాల నిర్వాహకులదేనని సీఐ రవీందర్ హెచ్చరించారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ నిబంధనలను పాటించాలని, భక్తిశ్రద్ధలతో పాటు ప్రశాంత వాతావరణంలో గణపతి ఉత్సవాలను నిర్వహించాలని ఆయన కోరారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలందరూ సహకరించి శాంతిభద్రతల పరిరక్షణకు తోడ్పడాలని సూచించారు

## బీఆర్ఎస్ వారం రోజుల నిరసన కార్యక్రమాలు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు, రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పట్లొల్ల కార్తిక్ రెడ్డి పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు వివిధ ప్రజా సమస్యలపై నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. సెప్టెంబర్ 2న శంషాబాద్ బస్‌స్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం కూడలి రోడ్డు వద్ద నిరసన కార్యక్రమం, నెరవేరని హామీల కార్డుల పంపిణీ చేపట్టనున్నారు. సాయంత్రం మర్రిచెట్టు వద్ద మణికొండ, నెక్నాంపూర్ మున్సిపల్ డివిజన్లలో పరిష్కారం కాని ప్రజా సమస్యలపై ఛార్జ్‌షీట్ విడుదల చేయనున్నారు. సెప్టెంబర్ 3న నీటి సరఫరా సమస్యపై డిప్యూటీ మేనేజర్ కార్యాలయం వద్ద, 22నా సమస్యపై లక్ష్మీనగర్ బీరప్ప ఆలయం క్రాస్‌రోడ్ వద్ద నిరసనలు నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 4న రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అంశంపై పాషా కాలనీ, బాపు హిల్స్, శివాజీనగర్, క్వార్టర్స్ ప్రాంతాల్లో నిరసనలు చేపట్టనున్నారు. సెప్టెంబర్ 5న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యపై అలకపూర్ గణేష్ చౌక్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 6న చిత్రపురి బస్తీ దవాఖానాను సందర్శించిన అనంతరం బీఆర్‌సీ నుంచి ఫ్రెండ్స్ కాలనీ వరకు మౌన ప్రదర్శన చేపట్టనున్నారు. సెప్టెంబర్ 7న ప్రజావాణిలో ప్రజా సమస్యలపై ఫిర్యాదు చేయనుండగా, సెప్టెంబర్ 8న నెక్నాంపూర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వినతిపత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల వివరాలను తెలియజేస్తూ పోలీస్ కమిషనర్‌కు సీతారాం ధూళిపాళ, కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, అందే లక్ష్మణ్ రావు, సుమనళిని, భాను చందర్, ఆశ్వక్ అలీ, శేఖర్ వేర్వేరుగా దరఖాస్తులు సమర్పించినట్లు పేర్కొన్నారు.



## బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడిని ఖండిస్తూ శాంతియుత నిరసన

బీజేపీ నేతల అరెస్ట్....

**క్రైమ్ మిర్రర్ శేరిలింగంపల్లి:** తెలంగాణ బీజేపీ శాఖ పిలుపు మేరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ ట్యాంక్‌బండ్‌పై ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద బీజేపీ నాయకులు, కార్యకర్తలు శాంతియుత నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, అయితే శాంతియుతంగా నిరసన చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడం దారుణమన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, శాంతియుత నిరసన చేసిన బీజేపీ నాయకులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడం సరికాదని, ఇలాంటి అరెస్టులకు బీజేపీ కార్యకర్తలు భయపడబోరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు కొండకల్ ఆనంద్ కుమార్, ములుగు జిల్లా ఓబీసీ ఇంచార్జ్ బుర్ర మహేందర్ యాదవ్, మాదాపూర్ డివిజన్ మాజీ ప్రధాన కార్యదర్శి శివ యాదవ్, మాజీ కార్యవర్గ సభ్యులు రాజ వర్ధన్ రెడ్డి, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు వినోద్ కుమార్, బీజేవైఎం మాజీ జనరల్ సెక్రెటరీ లింగస్వామి, శేరిలింగంపల్లి యువమోర్చా సభ్యులు హర్షిత్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చందానగర్ లో స్టెరాయిడ్ ఇంజక్షన్ల ముఠా అరెస్ట్....

రూ.96 వేల విలువైన 227 బాటిళ్లు స్వాధీనం.....





**క్రైమ్ మిర్రర్ చందానగర్:** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా హిమాచల్ ప్రదేశ్ నుంచి స్టెరాయిడ్ ఇంజక్షన్లు తెచ్చి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను చందానగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు చందానగర్ లోని పీజేఆర్ స్టేడియం వద్ద అక్రమంగా స్టెరాయిడ్ ఇంజక్షన్లు అమ్ముతున్నారనే సమాచారంతో పోలీసులు అక్కడికి వెళ్లారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా వారి వద్ద ఒక కాటన్ బాక్సులో 227 స్టెరాయిడ్ ఇంజక్షన్ బాటిళ్లు (ఒక్కొక్కటి 10 ఎం ఎల్ ) లభ్యమయ్యాయి. వాటి విలువ సుమారు రూ.96,475 గా అంచనా వేశారు. నిందితులను సారా సాయిరాం (39), మెడికల్ రిప్రజెంటేటివ్ మరియు కుంచాల రవీందర్ (25), జిమ్ ట్రైనర్ గా గుర్తించారు. ప్రాథమిక విచారణలో సాయిరాం ఒక్కో ఇంజక్షన్ ను రూ.37 లకు కొని రూ.425 లకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్లు, రవీందర్ జిమ్ కస్టమర్లకు అధిక రేట్లకు విక్రయిస్తున్నట్లు తేలింది. వీరి వద్ద ఇంజక్షన్లు విక్రయించేందుకు ఎలాంటి లైసెన్స్ లేదని పోలీసులు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యార్థులకు యూనిఫాంలు, చిన్నారులకు వర్క్ బుక్స్ పంపిణీ

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు సింగపూర్‌లో విద్యార్థులకు యూనిఫాంలు, ప్రీ-ప్రైమరీ చిన్నారులకు వర్క్ బుక్స్ పంపిణీ చేశారు. సింగపూర్‌లోని ఎంపీపీఎస్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో 1వ వార్డు కౌన్సిలర్ ఆనంద్ రావు ఎర్ర, 9వ వార్డు కౌన్సిలర్ గణేష్, 10వ వార్డు కౌన్సిలర్ రాజన్న వసంత మహేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ మడపతి చంద్రమౌళి పాల్గొని విద్యార్థులకు యూనిఫాంలను, ప్రీ-ప్రైమరీ విభాగంలోని చిన్నారులకు వర్క్ బుక్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ద్వారా వారి చదువుపై ఆసక్తి పెంపొందించడంతో పాటు, అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరచేందుకు దోహదపడుతుందని ఉపాధ్యాయులు తెలిపారు. ముఖ్యంగా చిన్నారుల ప్రాథమిక విద్యా దశలో వర్క్ బుక్స్ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు ప్రజాప్రతినిధులు ముందుకు రావడం అభినందనీయమని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తెలిపారు.





## క్యాడర్ స్కీమ్‌తో ఆరుగురికి పదోన్నతులు


### జీఎం ఎన్. రాధాకృష్ణ చేతుల మీదుగా ఉత్తర్వుల అందజేత

**మందమర్రి సెప్టెంబర్ 1 (క్రైమ్ మిర్రర్) :** సింగరేణి మందమర్రి ఏరియాలో ఆరుగురు ఉద్యోగులకు క్యాడర్ స్కీమ్ కింద పదోన్నతులు లభించాయి. మంగళవారం ఏరియా జీఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ పదోన్నతి ఉత్తర్వులను ఉద్యోగులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన పదోన్నతి పొందిన ఉద్యోగులకు శు భాకాంక్షలు తెలిపారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదోన్నతులు సాధించాలని ఆకాంక్షించారు.జూనియర్ అకౌంటెంట్లుగా పోతు రమ్యసుధ, ఆకునూరి సంపత్, అసిస్టెంట్ చైర్మన్లుగా ఎస్.కె. తాజుద్దీన్, సిహెచ్. వెంకటకృష్ణంరాజు, ఆఫీస్ అటెండెంట్లుగా సిరికొండ సీతమ్మ, ఆరుట్ల రమేష్ పదోన్నతులు పొందారు.ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) సిహెచ్. అశోక్, ఏజీఎం (ఎఫ్అండ్ఏ) ఆర్.వి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, డీజీఎం (సర్వే) బుఖ్య దేశాయ్, సీనియర్ పీఓ సురేందర్, ఆఫీస్ సూపరింటెండెంట్ (పర్సనల్) రాయలింగు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మహాదేవ్‌పూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం..!!

### లారీ--ద్విచక్ర వాహనం ఢీ

### గుమ్మలకొండకు చెందిన వెంకటి దుర్మరణం



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ జిల్లా మహాదేవ్‌పూర్ మండలంలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. లారీ, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు, ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. మృతుడిని సిరొంచా ప్రాంతంలోని గుమ్మలకొండ గ్రామానికి చెందిన వెంకటిగా గుర్తించారు. ప్రమాదానికి కారణమైన లారీ నంబర్ టిఎస్09యూఎన్6147 గా తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. ప్రమాదానికి గల పూర్తి కారణాలు, లారీ డ్రైవర్ పరిస్థితి తదితర వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# మంచిర్యాల ప్రైవేట్ ఆసుపత్రుల్లో డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీలు

### వైద్య సేవల ధరల పట్టికలు ప్రదర్శించాలి

### అన్ని ఆసుపత్రులూ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ కింద నమోదు చేసుకోవాలి

### డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్

**మంచిర్యాల సెప్టెంబర్ 1 (క్రైమ్ మిర్రర్):** ప్రైవేట్ ఆసుపత్రులన్నీ తప్పనిసరిగా 'క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్' నిబంధనలు పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ హెచ్చరించారు. మంచిర్యాల పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.పట్టణంలోని సిటీ న్యూరో, శ్రీహర, ఆదిత్య, సచిన్ హాస్పిటళ్లను సందర్శించిన డీఎంహెచ్‌ఓ.. ఆయా ఆసుపత్రుల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నిర్వహిస్తున్న వైద్య సేవలు, ప్రభుత్వం నుంచి వచ్చిన బిల్లులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..



జిల్లా వ్యాప్తంగా ఉన్న అల్లోపతి, ఆయుర్వేద, యునాని, హోమియోపతి, సిద్ధ, డెంటల్ ఆసుపత్రులతో పాటు డయాగ్నోస్టిక్ సెంటర్లు, రక్తపరీక్ష కేంద్రాలు తప్పనిసరిగా జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని స్పష్టం చేశారు.ఆసుపత్రిలో పనిచేసే వైద్యులు, నిపుణుల వివరాలతో పాటు వైద్య సేవల ఛార్జీల వివరాలను ప్రతి ఒక్కరికీ స్పష్టంగా కనిపించేలా బోర్డులపై ప్రదర్శించాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే బాధితులు, వారి సంబంధీకుల కోసం తాగునీరు, సీటింగ్ సౌకర్యాలు కల్పించాలని, అత్యవసర రోగులకు వీల్ చైర్లు, స్ట్రెచర్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. రోగి రాగానే ఆయా సిబ్బంది బాధ్యతగా లోపలికి తీసుకెళ్లి, వారి ఆరోగ్య పరిస్థితిపై బంధువులకు ఎప్పటికప్పుడు కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు.ఆసుపత్రులు తప్పనిసరిగా ఫైర్ సేఫ్టీ, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ సర్టిఫికెట్లు కలిగి ఉండాలని, పారామెడికల్ సిబ్బంది సమాచారాన్ని లేబర్ కమిషనర్‌కు అందజేయాలని సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, డెంగ్యూ జ్వరాలు వ్యాపిస్తున్న నేపథ్యంలో రోగులను అనవసరంగా భయపెట్టకుండా సకాలంలో మెరుగైన చికిత్స అందించాలని పేర్కొన్నారు. పరిశీలించిన నాలుగు ఆసుపత్రుల్లో సేవలు బాగున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ తనిఖీల్లో ఆయా ఆసుపత్రుల వైద్యులు డాక్టర్ అబ్బురి శ్రీనివాస్, డాక్టర్ గంప మల్లేష్, డాక్టర్ ప్రతాప్ గౌడ్, డాక్టర్ వినోద్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# కేకే-5, కేకే ఓసీల్లో 100శాతం ఉత్పత్తి

### కార్మికులు, అధికారులకు జీఎం రాధాకృష్ణ అభినందనలు

**మందమర్రి, సెప్టెంబర్ 1 (క్రైమ్ మిర్రర్) :** మందమర్రి ఏరియాలోని కేకే-5 భూగర్భ గనితో పాటు కేకే ఓపెన్‌కాస్ట్ గనుల్లో ప్రతి నెలా 100 శాతం ఉత్పత్తి లక్ష్యాలు సాధిస్తూ ఏరియాను ముందంజలో నిలుపుతున్న కార్మికులు, అధికారులు, గుర్తింపు సంఘాల నాయకులను మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ అభినందించారు. మంగళవారం జీఎం కార్యాలయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీ.ఎం రాధాకృష్ణ మాట్లాడుతూ

**లక్ష్యానికి మించి ఉత్పత్తి:** ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి డిస్పాచ్, ఓవర్ బర్డెన్ (ఓబీ) తొలగింపులో మందమర్రి ఏరియా వరుసగా 100 శాతానికి పైగా ప్రగతి సాధిస్తోందని జీఎం తెలిపారు. ఆగస్టు నెలకు గాను 1.74 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికిగానూ 105 శాతం సాధించామని వివరించారు. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు నిర్దేశించుకున్న లక్ష్యాలను అధిగమించామని పేర్కొన్నారు. కేకే-5, కేకే ఓసీల



స్ఫూర్తితో మిగతా గనుల కార్మికులు కూడా భద్రతతో కూడిన ఉత్పత్తిని పెంచాలని పిలుపునిచ్చారు.

**వేగంగా ఆర్‌కేపీ ఓసీ-3 విస్తరణ:** ఆర్‌కేపీ ఓసీ-3 ప్రాజెక్టుకు సంబంధించిన అటవీ శాఖ అనుమతుల ప్రక్రియ (ఫారెస్ట్ క్లియరెన్స్) వేగవంతమైందని జీఎం వెల్లడించారు. ఫైలు పీసీసీఎఫ్ కార్యాలయానికి చేరిందని, మరో వారంలో ఆన్‌లైన్ కమిటీ పరిశీలన అనంతరం కేంద్రానికి వెళ్లనుందని చెప్పారు.

**రూ.7.5 కోట్లతో అక్షయపాత్ర హైటెక్ కిచెన్:** సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద సింగరేణి సంస్థ రూ.7.5 కోట్ల నిధులతో మంచిర్యాల పరిసర ప్రాంతాల్లోని విద్యార్థులకు నిత్యం ఉదయాన్నే వేడివేడి టిఫిన్ అందించేందుకు 'హరేకృష్ణ చారిటబుల్ ట్రస్ట్' ద్వారా ఆధునిక కిచెన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

**రవాణా వ్యయానికి అడ్డుకట్ట:** ఆర్‌ఆర్ కాలనీ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, కొత్త రహదారి అందుబాటులోకి వస్తే బొగ్గు, ఇసుక రవాణా దూరం తగ్గి సంస్థకు రూ.కోట్లలో రవాణా వ్యయం తగ్గుతుందన్నారు. సీఎమ్‌పీఎఫ్, పెన్షన్ సమస్యలు రాకుండా కార్మికులకు, వెల్ఫేర్ అధికారులకు ఈ నెలలోనే ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తామని చెప్పారు.ఈ సమావేశంలో ఐఈడీ డీజీఎం కిరణ్‌కుమార్, డీజీఎం (పర్సనల్) అశోక్, సీనియర్ పీఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అనధికార నిర్మాణాల పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్....





క్రైమ్ మిర్రర్ సైబరాబాద్:సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలో అనధికార నిర్మాణాలపై సెప్టెంబర్ 1, 2026న క్షేత్రస్థాయి గుర్తింపు మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను కొనసాగించింది.మంగళవారం సీఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు క్షేత్రస్థాయి తనిఖీల ద్వారా 36 అనధికార నిర్మాణాలను గుర్తించాయి.లి అందులో 26 నిర్మాణాలను కూల్చివేయగా, 10 నిర్మాణాలకు నోటీసులు జారీలి చేశారు మరియు ఒక నిర్మాణాన్ని సీజ్‌లి చేశారు. గుర్తించిన మిగిలిన 10 నిర్మాణాలపై తదుపరి ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు నిర్దేశిత విధానం మరియు వర్తించే నిబంధనల ప్రకారం చేపట్టబడతాయి.

**జోన్‌ల వారీగా కూల్చివేతలు:** శేరిలింగంపల్లి జోన్ లో 8 కూకట్‌పల్లి జోన్ లో 7 కుత్బుల్లాపూర్ జోన్ లో 11అనధికార నిర్మాణాలపై క్షేత్రస్థాయి తనిఖీలు, గుర్తింపు మరియు నిరంతర పర్యవేక్షణను కొనసాగించాలని సంబంధిత టౌన్ ప్లానింగ్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను కమిషనర్ ఆదేశించారు.

## ఏడురకాల వరి వంగడాలు సాగు చేస్తేనే బోనస్

### పాలకీడు మండల వ్యవసాయ అధికారి కళ్యాణ్ చక్రవర్తి



**క్రైమ్ మిర్రర్ , పాలకీడు :** వానకాలం సీజన్లో ప్రభుత్వం సూచించిన ఏడు రకాల వరి వంగడాలను సాగు చేసి రైతులకు 500 రూపాయలు బోనస్ పొందాలని మండల వ్యవసాయ అధికారి బి కళ్యాణ్ చక్రవర్తి మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. బిపిటి 5204, కేఎన్ఎం 1638, తెలంగాణ సోనా, ఎచ్ఎంటి సోనా, జై శ్రీరామ్, డబ్లుజిఎల్ 44, కేఎన్ఎం 7715 వరి వంగడాలు సాగు చేస్తేనే క్వింటాలుకు రూ.500 రైతులు బోనస్ పొందగలరని చెప్పారు.ఈ 7 రకాలు సాగు చేసిన రైతులు టీ అగ్రిఫీల్ పోర్టల్లో సెప్టెంబర్ 10లోగా నమోదు చేసుకోవాలని కోరారు. డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసిన రైతు లు పట్టాదారు పాసుబుక్, విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లు తీసుకొని డీలర్ వద్దనే సాగు వివరాలను వెంటనే నమోదు చేసుకోవాలన్నారు. సొంత విత్తనాలు, ఇతర రైతులు వద్ద విత్తనాలు కొని సాగు చేసుకున్న రైతులు స్వీయ ధృవీకరణ పత్రం సమర్పించి ఏఈఓ ల వద్ద నమోదు చేసుకోవాలన్నారు. నిర్ణీత గడువులో నమోదు చేసుకుని ధాన్యంపై క్వింటాలుకు 500 రూపాయలు బోనస్ పొందాలన్నారు.

# మాదకద్రవ్యాలకు 'నో' చెప్పండి

### యువత భవిష్యత్తును కాపాడుకోండి: డీఎంహెచ్‌ఓ నరేందర్ రాథోడ్

### 400 మంది ఐటీఐ విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, డ్రగ్స్ అడిక్షన్‌పై అవగాహన

**మంచిర్యాల, సెప్టెంబరు 1 క్రైమ్ మిర్రర్):** మాదకద్రవ్యాలకు బానిస కావద్దని, స్వేచ్ఛాయుత జీవితాన్ని ఎంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ విద్యార్థులకు సూచించారు. మాదకద్రవ్యాలు ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా సామర్థ్యం, శక్తి, జ్ఞానం, కుటుంబ సంబంధాలు, భవిష్యత్తును కూడా దెబ్బతీస్తాయని తెలిపారు.మంచిర్యాల ఐటీఐ అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో మంగళవారం విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, డ్రగ్స్ అడిక్షన్, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐటీఐ ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపల్ సునీల్‌తో కలిసి డీఎంహెచ్‌ఓ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సుమారు 400 మంది విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, వ్యసనానికి గురైతే ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించి, మోటివేషనల్ స్పీచ్ ఇచ్చారు.ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం వల్ల నియంత్రణ కోల్పోయి వ్యసనానికి గురయ్యే ప్రమాదం




ఉందన్నారు. తొలుత స్వల్పకాలిక సమస్యగా కనిపించినా దీర్ఘకాలంలో శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని చెప్పారు. విద్య, ఉద్యోగం, సంబంధాలు, వ్యక్తిగత లక్ష్యాలపై ప్రతికూల ప్రభావం పడటంతోపాటు భవిష్యత్తు అవకాశాలను దెబ్బతీస్తుందని వివరించారు.వివిధ గ్రామాలు, ప్రాంతాల నుంచి వచ్చి చదువుకుంటున్న విద్యార్థులు ఎలాంటి ప్రలోభాలకు లొంగవద్దని సూచించారు. చెడు స్నేహాలు, చెడు అలవాట్లు, ప్రతికూల ఆలోచనలకు దూరంగా ఉండాలని చెప్పారు. జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించే దిశగా క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు.విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలు, ఆలోచనా విధానంలో మార్పులు లేదా ఇతర ఇబ్బందులు కనిపిస్తే వాటిని నిర్లక్ష్యం చేయకుండా మానసిక నిపుణులను సంప్రదించాలని డీఎంహెచ్‌ఓ సూచించారు. ఉచిత



మానసిక ఆరోగ్య కౌన్సెలింగ్ కోసం టెలీ-మానస్ 14416కు ఫోన్ చేసి నిపుణుల సహాయం పొందవచ్చని తెలిపారు. విద్యార్థుల సమస్యలను ఉపాధ్యాయులు, లెక్చరర్లు సానుకూలంగా విని అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు.అనంతరం మాదకద్రవ్యాల నిర్మూలనకు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాలను ప్రతి నెలా నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ అనిల్, మానసిక వైద్య నిపుణులు డాక్టర్ సునీల్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, అల్లాడి శ్రీనివాస్, రషీద్, సీహెచ్‌ఓలు నాందేవ్, కాకిరాల వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, పున్నమయ్య, ఆప్తాలమిక్ అధికారి శంకర్, ఐటీఐ సిబ్బంది, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ నోటీసులతో ప్రజల అవస్థలు....

### కార్యాలయాల చుట్టూ తిప్పుతున్న అధికారులు...

**క్రైమ్ మిర్రర్ శేరిలింగంపల్లి :** "ఓటు వేయకపోయినా పర్లేదు.. ఆఫీసుల చుట్టూ తిరగలేం" అంటూ శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఎస్ఐఆర్ నోటీసుల పేరుతో బీఎల్ఓలు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని, అసలు ఏ డాక్యుమెంట్లు కావాలో కూడా స్పష్టంగా చెప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఒక్క డాక్యుమెంట్ చాలా అంటారా? 10వ తరగతి మెమో తప్పనిసరా? అనేది కూడా చెప్పకపోవడంతో ఒకే పనికి 3-4 సార్లు మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని మండిపడుతున్నారు.వృద్ధులు, ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగులు సెలవులు పెట్టుకుని, విద్యార్థులు క్లాసులు మానేసి వచ్చినా పని కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటరు ఉన్నాడా లేడా అని ప్రత్యక్షంగా పరిశీలించి యాప్‌లో వివరాలు నమోదు చేస్తే సరిపోతుందని, ప్రజలను ఇలా ఆఫీసుల చుట్టూ తిప్పడం సరికాదని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఒక్కసారికే పని అయిపోయేలా స్పష్టమైన డాక్యుమెంట్ లిస్ట్ ఇవ్వాలని కోరుతున్నారు.



# పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలి

## సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్





పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 01: పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు కష్టపడి చదువుతూ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాలను తప్పకుండా సాధించగలరని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత శిక్షణ, స్టడీ మెటీరియల్, ఇతర సదుపాయాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును బంగారు భవిష్యత్తుగా తీర్చిదిద్దుకోవాలని ఆయన సూచించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్, పోలీస్ తదితర పోటీ పరీక్షలకు సంబంధించి ఐదు నెలల ఉచిత ఫౌండేషన్ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పొందుతున్న విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి పోటీ పరీక్షకు పెద్ద సంఖ్యలో అభ్యర్థులు పోటీ పడుతున్నారని, అందువల్ల పోటీని చూసి నిరుత్సాహపడకుండా వంద శాతం శ్రమ, ఏకాగ్రత, పట్టుదలతో లక్ష్యం దిశగా ముందుకు సాగాలని సూచించారు. పోటీ పరీక్షలకు అవసరమైన నాలెడ్జ్‌ను పెంపొందించుకోవడంతో పాటు ప్రతిరోజూ నిర్ణీత సమయాన్ని కేటాయించి ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని అన్నారు. మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది. పట్టుదలతో, ఆత్మవిశ్వాసంతో చదివితే విజయం సాధించడం సాధ్యమే అని కలెక్టర్ విద్యార్థులకు ఉద్బోధించారు. జీవితంలో ప్రతి రంగంలోనూ సమస్యలు, సవాళ్లు ఉంటాయని, వాటిని అధిగమించే మన దృక్పథంపైనే వాటి ప్రభావం ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. సమస్యలను చూసి వెనుకడుగు వేయకుండా వాటిని అవకాశాలుగా మలుచుకుని ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా కష్టపడి చదవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలను సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించే వరకు నిరంతరంగా కృషి చేయాలని, విజయం సాధించాలనే నమ్మకంతో ముందుకు సాగాలని అన్నారు. అనంతరం కలెక్టర్ బీసీ స్టడీ సర్కిల్‌లోని క్లాస్‌రూమ్‌లు, స్టడీ మెటీరియల్, విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, అధ్యయన వాతావరణాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందేలా చూడాలని, అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచాలని, స్టడీ సర్కిల్‌లోని సదుపాయాలను మరింత మెరుగుపరచాలని నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ ఐదు నెలల ఉచిత ఫౌండేషన్ శిక్షణ ద్వారా వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు పరీక్షల విధానం, సిలబస్, ప్రాథమిక అంశాలు, సాధారణ అవగాహన తదితర అంశాల్లో అవసరమైన మార్గదర్శకత్వం లభించనుందని బిసి సంక్షేమ అధికారి జగదీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీష్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్, శిక్షకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.



# క్యాతనపల్లిలో 'సర్-2' నోటీసుల పంపిణీ

### 59వ బూత్‌ను పరిశీలించిన తహసీల్దార్ సతీష్‌కుమార్

### వివరాల్లో తప్పులుంటే ఆధారాలు సమర్పించాలని సూచన

**రామకృష్ణాపూర్ సెప్టెంబర్2 (క్రైమ్ మిర్రర్)** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న'సర్--2' ప్రక్రియలో భాగంగా క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 59వ పోలింగ్ బూత్‌లో ఓటర్లకు నోటీసులు అందజేశారు. మంగళవారం బూత్ పరిశీలకుడిగా మందమర్రి తహసీల్దార్ సతీష్‌కుమార్ కేంద్రాన్ని సందర్శించి ప్రక్రియను పరిశీలించారు. ఓటర్లకు నోటీసులు అందజేశారు. 2002 ఓటర్ల జాబితాను ప్రాతిపదికగా తీసుకుని ప్రస్తుత వివరాలను పరిశీలిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. తల్లిదండ్రుల పేర్లు, వయస్సు, ఇంటిపేరు తదితర వివరాల్లో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించిన ఓటర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. బూత్ పరిధిలో సంబంధిత ప్రతి ఓటరుకు నోటీసులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమతోపాటు తల్లిదండ్రులకు సంబంధించిన అవసరమైన ఆధార పత్రాలను జతచేసి, నిర్ణీత గడువులోగా సంబంధిత బీఎల్ఓలకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు పల్లె రాజు, 18వ వార్డు కౌన్సిలర్ పల్లె శ్రీదేవి, పట్టణ ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్, మహిళా నాయకులు పుష్ప, రాజేశ్వరి, స్థానిక నాయకులు, బీఎల్ఓలు, ఓటర్లు పాల్గొన్నారు.

# జోయ్ ఆసుపత్రిలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అత్తాపూర్ పోలీసులు జోయ్ ఆసుపత్రిలో ప్రత్యేక సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ ఏ. సీతయ్య, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ బి. రాజానాయక్, సైబర్ వారియర్, పెట్రోలింగ్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జోయ్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్, మేనేజ్‌మెంట్ సిబ్బంది, ఎగ్జిక్యూటివ్ సిబ్బంది, ఉద్యోగులు, కార్మికులు, సందర్శకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుతం జరుగుతున్న వివిధ రకాల సైబర్ మోసాలపై పోలీసు అధికారులు వివరించారు. బాస్ స్కామ్‌లు, ఏపీకే ఫైల్ మోసాలు, ఓటీపీ మోసాలు, క్రెడిట్ కార్డు మోసాలు, వాట్సాప్ డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న మోసాలు, మాల్‌వేర్, ఆన్‌లైన్ పెట్టుబడులు, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే ఇన్‌స్టాగ్రామ్‌లో నకిలీ వెబ్‌సైట్లు, ఫేక్ లింకుల ద్వారా మోసాలు జరిగే అవకాశం ఉన్నందున తెలియని లింకులను క్లిక్ చేయవద్దని హెచ్చరించారు.

**జెర్మినెటిన్ ఆసుపత్రిలోనూ అవగాహన**

అత్తాపూర్ పోలీసు అధికారులు జెర్మినెటిన్ ఆసుపత్రిలో కూడా సిబ్బంది, మేనేజర్లతో సమావేశమై సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురికాకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు, మెసేజ్‌లు, ఫోన్ కాల్స్‌కు స్పందించేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణలో భాగంగా ప్రజలకు, వివిధ సంస్థల సిబ్బందికి నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అత్తాపూర్ పోలీసులు తెలిపారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో రౌడీషీటర్లకు అత్తాపూర్ పోలీసుల కౌన్సెలింగ్



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు అత్తాపూర్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా రౌడీ షీటర్లపై నజర్ పేరుతో రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 72 మంది రౌడీషీటర్లు ఉండగా, వారిలో 45 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవాల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి కార్యకలాపాలకు పాల్పడవద్దని పోలీసులు కఠినంగా సూచించారు. అవాంఛనీయ సంఘటనలు లేదా అనుమానాస్పద సమాచారం తమ దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆదేశించారు. రౌడీషీటర్లు ఎవరైనా తమ ప్రాంతం విడిచి వెళ్లాల్సి వస్తే సంబంధిత సెక్టార్ ఎస్ఐకి ముందస్తు సమాచారం అందించి అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. పోలీసుల ఆదేశాలను ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అత్తాపూర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ ఏ. సీతయ్య, సబ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులు, జయరాజ్, హెడ్ కానిస్టేబుల్ కృష్ణతో పాటు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా ముందస్తు చర్యల్లో భాగంగానే ఈ కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ఇన్‌స్పెక్టర్ ఏ. సీతయ్య తెలిపారు.

# సెప్టెంబర్ 3 వ తేదీన ఎన్ ఆర్ ఐ కోటా లో మిగిలిన యూజీ సీట్లకి వాక్ ఇన్ కౌన్సిలింగ్

### గతంలో దరఖాస్తు చేసుకోకపోయినా హాజరు కావొచ్చు

### అగ్రి వర్సిటీ ఉప కులపతి అల్దాస్ జానయ్య



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధి లో 2026-27 విద్యా సంవత్సరానికి కల కళాశాలల లో వివిధ అండర్ గ్రాడ్యూయేట్ కోర్సులలో ఎన్ఆర్ఐ /ఎన్ఆర్ఐ ప్రాయోజిత కోటా లో మిగిలిన సీట్లలో ప్రవేశాలకి సెప్టెంబర్ 3 వ తేదీ( గురువారం)న వాక్ ఇన్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ప్రకటించారు. రాజేంద్రనగర్ లోని విశ్వవిద్యాలయం ఎగ్జామినేషన్స్ సెంటర్ లో ఉదయం పది గంటలకు ధృవ పత్రాల పరిశీలన, కౌన్సిలింగ్ జరగనుందని అల్దాస్ జానయ్య వివరించారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల తో పాటు అనివార్య కారణాల వల్ల దరఖాస్తు చేసుకొని వారు సైతం కౌన్సిలింగ్ కి హాజరు కావొచ్చని ఆయన స్పష్టం చేసారు. అభ్యర్థులు వారి తల్లి తండ్రులు విశ్వవిద్యాలయం వెబ్ సైట్ ఀఀఀ.జూయ్ఘబ.వఎబ.ఱఅ ని సందర్శించి పూర్తి వివరాలు తెలుసుకొని అర్హత కల అభ్యర్థులు అవసరం అయిన పత్రాలు, ఫీజు ల తో కౌన్సిలింగ్ కి హాజరు కావాల్సింది గా అల్దాస్ జానయ్య సూచించారు.

# అనధికార నిర్మాణాల పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్....





క్రైమ్ మిర్రర్

సైబరాబాద్: సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలో అనధికార నిర్మాణాలపై సెప్టెంబర్ 1, 2026న క్షేత్రస్థాయి గుర్తింపు మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను కొనసాగించింది. మంగళవారం సీఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు క్షేత్రస్థాయి తనిఖీల ద్వారా 36 అనధికార నిర్మాణాలను గుర్తించాయి. లి అందులో 26 నిర్మాణాలను కూల్చివేయగా, 10 నిర్మాణాలకు నోటీసులు జారీలి చేశారు మరియు ఒక నిర్మాణాన్ని సీజ్‌లి చేశారు. గుర్తించిన మిగిలిన 10 నిర్మాణాలపై తదుపరి ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు నిర్దేశిత విధానం మరియు వర్తించే నిబంధనల ప్రకారం చేపట్టబడతాయి.

**జోన్‌ల వారీగా కూల్చివేతలు:** శేరిలింగంపల్లి జోన్ లో 8 కూకట్‌పల్లి జోన్ లో 7 కుత్బుల్లాపూర్ జోన్ లో 11అనధికార నిర్మాణాలపై క్షేత్రస్థాయి తనిఖీలు, గుర్తింపు మరియు నిరంతర పర్యవేక్షణను కొనసాగించాలని సంబంధిత టౌన్ ప్లానింగ్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను కమిషనర్ ఆదేశించారు.

# మైలార్‌దేవ్‌పల్లి పోలీసుల దాడి

### 2 కిలోల గంజాయి స్వాధీనం

### ఇద్దరు అరెస్ట్.. పరారీలో గంజాయి సరఫరాదారు






**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ విక్రయానికి పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 2 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరో గంజాయి సరఫరాదారుడిని గుర్తించిన పోలీసులు అతడి కోసం గాలింపు చేపట్టారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ ఇన్‌స్పెక్టర్ సి. శ్రీనివాస్ తెలిపారు. ఉడెంగడ్డ లోని మైలార్‌దేవ్‌పల్లి మసీదు సమీపంలో గంజాయి అక్రమ విక్రయం జరుగుతోందన్న విశ్వసనీయ సమాచారం మేరకు సెప్టెంబర్ 1న ఉదయం సుమారు 9:30 గంటలకు పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో కాలేజీ బ్యాగ్‌తో వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను గమనించి పారిపోయేందుకు ప్రయత్నించగా, వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు మొహద్ అర్మాన్ (23), శాస్త్రీపురం, హైదరాబాద్‌కు చెందిన బైక్ మెకానిక్, మీర్ అక్రమ్ అలీ (43), నవాబ్‌సాహెబ్‌కుంట, ఫలక్‌నుమాకు చెందిన వంటమనిషిగా పోలీసులు గుర్తించారు. పంచ సాక్షులు, క్లూస్ టీమ్ సమక్షంలో వారి వద్ద తనిఖీలు నిర్వహించగా రెండు ప్యాకెట్లలో మొత్తం 2 కిలోల గంజాయి లభించింది. దీంతో గంజాయితో పాటు రెండు ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లు, కాలేజీ బ్యాగ్, ప్యాకింగ్ సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి చట్ట ప్రకారం చర్యలు చేపట్టినట్లు మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ ఇన్‌స్పెక్టర్ సి. శ్రీనివాస్ తెలిపారు. దర్యాప్తులో గంజాయి సరఫరాదారుడిని కూడా గుర్తించినట్లు, అతడిని పట్టుకునేందుకు చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. గంజాయి అక్రమ సరఫరా వెనుక ఉన్న నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు దర్యాప్తు కొనసాగుతోంది.

# ధనపాల్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నేపాల్‌లో సంభవించిన ప్రకృతి విపత్తుల నేపథ్యంలో గత పది రోజులుగా ఆచూకీ తెలియకుండా పోయిన మణికొండ నివాసి ధనపాల్ రెడ్డి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ఫోన్ లో పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ధనపాల్ రెడ్డి సుమారు పది రోజుల క్రితం నేపాల్ విహారయాత్రకు వెళ్లారు. అక్కడ సంభవించిన ప్రకృతి విపత్తుల అనంతరం ఆయన ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తమ కుటుంబ సభ్యుడి కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ధనపాల్ రెడ్డి కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని, కుటుంబ సభ్యులు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. అనంతరం మణికొండ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ రామకృష్ణ రెడ్డి, మణికొండ మాజీ సర్పంచ్ నరేష్, నాయకులు సాయిరెడ్డి, మాజీ కౌన్సిలర్స్ శైలజ, వందన ధనపాల్ రెడ్డి కుటుంబ సభ్యుల నివాసానికి వెళ్లి వారిని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, ధనపాల్ రెడ్డి క్షేమంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఆయన ఆచూకీ కోసం అధికారుల ద్వారా అవసరమైన చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

# నార్సింగి సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల తొలగింపు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నార్సింగి సర్కిల్--45 పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పుప్పలగూడ నేమలినగర్ ప్రాంతంలో నిర్మించిన 4 అక్రమ భవనాలను, నెక్నాంపూర్ అల్కాపూర్ కాలనీలోని మరో అక్రమ భవనాన్ని అధికారులు కూల్చివేశారు. ఈ కూల్చివేత చర్యలను నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి పర్యవేక్షించారు. సంబంధిత నిబంధనలను ఉల్లంఘించి చేపట్టిన నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది ఆధ్వర్యంలో ఈ కూల్చివేత చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు.



# సీఎం సహాయ నిధి పేదలకు వరం

## రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** సీఎం సహాయ నిధి పేదలకు వరంగా మారిందని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు ప్రాంతానికి చెందిన జేబీ యాకూబ్ కుమారుడు జేబీ షఫీ అహ్మద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో డబ్బులు చెల్లించేందుకు ఇబ్బందిగా మారింది. సీనియర్ నాయకులు నదీమ్ ఆధ్వర్యంలో సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేయించారు. దీంతో సీఎంఆర్ఎఫ్ మంజూరు కింద ఎల్‌వోసీ రూ.5 లక్షలను మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న, అందజేస్తున్న సంక్షేమ ఫథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా అనేక మందిని ఆదుకోవడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో మరింత మంది పేదలకు సహాయ సహకారాలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# నేపాల్ వరదల్లో గల్లంతైన ధనపాల్ రెడ్డి కుటుంబానికి పరామర్శ కుటుంబ సభ్యులను ఓదార్చిన బీజేపీ నాయకులు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మానస సరోవర యాత్రలో భాగంగా నేపాల్‌కు వెళ్లిన రాళ్లగూడెం ప్రాంతానికి చెందిన ధనపాల్ రెడ్డి నేపాల్‌లో సంభవించిన వరద ప్రళయం నేపథ్యంలో గల్లంతైనట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు ఆయన కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. మణికొండ మాజీ వైస్ చైర్మన్ కొండకళ్ల నరేందర్ రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ధనపాల్ రెడ్డి క్షేమంగా తిరిగి వస్తారనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా ధనపాల్ రెడ్డి ఆచూకీ కోసం సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. కుటుంబ సభ్యులు అధైర్యపడవద్దని, ధనపాల్ రెడ్డి క్షేమంగా తిరిగి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ డివిజన్ అధ్యక్షులు బి. రవికాంత్ రెడ్డి, వినోద్, శివ, రాజేష్, రఘు, సతీష్ తదితర బీజేపీ నాయకులు పాల్గొని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

# ఉరి వేసుకోని విద్యార్థి మృతి

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఉరి వేసుకోని ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బన్సీలాల్‌నగర్ ప్రాంతానికి చెందిన పి.మోహన్, పి.జ్యోతి భార్యభర్తలు. వీరికి ముగ్గురు సంతానం. మొదటి కుమారుడు పి.ప్రశాంత్(14) రాజపేటలోని సాంఘిక సంక్షేమ వెల్ఫేర్‌లో చదువుతున్నాడు. ఇదిలా ఉండగా గత రెండు నెలల క్రితం ప్రశాంత్ స్కూల్‌కు వెళ్లనని చెప్పడంతో భార్య అతడిని మందలించింది. దీంతో ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయి రెండు రోజుల తరువాత తిరిగి ఇంటికి వచ్చాడు. ఆ తరువాత అతడిని ఇంట్లో ఎవరు ఏమి అనలేదని తెలిపారు. సోమవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకోని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. సమాచారాన్ని పోలీసులు ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకోని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చరీకి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ బోనాలు, కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## వైభవంగా 43వ వార్షిక బోనాలు, కల్యాణ మహోత్సవాలు



గండిపేట(క్రైమ్ మిర్రర్): మహేశ్వరం మండలం రావిరాల గ్రామంలో కొలువైన శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ దేవస్థానంలో 43వ వార్షిక బోనాలు, కల్యాణ మహోత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే శ్రీ ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు ఆలయ ఫౌండర్, ట్రస్ట్ చైర్మన్ శ్రీ రెడ్డిగళ్ల రత్నం, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ తల్లి కరుణాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. భక్తి, ఆధ్యాత్మికతతో నిర్వహించే ఇలాంటి పండుగలు ప్రజల్లో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. బోనాలు, కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి దర్శనం కోసం పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో కిక్కిరిసింది. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆపదలో అండగా.. ఆత్మీయతలో ముందుగా

## పగిల్ల కొండయ్య కుటుంబానికి సర్పంచ్ లపంగి ఆర్థిక సాయం



**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** గ్రామ ప్రజలకు ఏ కష్టం వచ్చినా తనవంతు సహాయం అందిస్తూ, అండగా నిలుస్తున్న రాంరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ లపంగి నర్సింహా, మరోసారి తన మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. గ్రామానికి చెందిన పగిల్ల కొండయ్య మృతి చెందిన విషయం తెలుసుకున్న సర్పంచ్ వెంటనే స్పందించి, మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కష్టకాలంలో ఉన్న ఆ కుటుంబానికి అండగా నిలిచిన సర్పంచ్ లపంగి నర్సింహా, అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆపద సమయంలో ఆర్థికంగా కొంత ఊరట కల్పించడంతో పాటు, బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పడం పట్ల గ్రామస్తులు సర్పంచ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లపంగి నర్సింహా మాట్లాడుతూ.. గ్రామంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా తనకు సమాచారం అందిన వెంటనే స్పందించి, తనవంతు సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని ఆయన తెలిపారు. ప్రజలు కష్టాల్లో ఉన్న సమయంలో వారికి అండగా నిలవడం, ప్రజా ప్రతినిధిగా తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు. పదవి అనేది కేవలం హోదా కోసం కాదని, ప్రజలకు సేవ చేయడానికి లభించిన అవకాశంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. గ్రామ ప్రజల సుఖ దుఃఖాల్లో భాగస్వామిగా ఉంటూ, అవసరమైన సమయంలో బాధిత కుటుంబాలకు తోడుగా నిలవాలన్నదే తన ఉద్దేశమని సర్పంచ్ తెలిపారు. గ్రామ అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమానికి కూడా ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతానని చెప్పారు. గ్రామ సమస్యలను తెలుసుకోవడంతో పాటు, ఆపద సమయంలో బాధిత కుటుంబాల వద్దకు స్వయంగా వెళ్లి పరామర్శించడం, తనవంతు సహాయం అందించడం ద్వారా, సర్పంచ్ లపంగి నర్సింహ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రజల కష్టాల్లో తోడుగా నిలిచే ప్రజాప్రతినిధిగా ఆయన వ్యవహరిస్తున్న తీరు అభినందనీయమని పలువురు తెలిపారు. ఈ కార్యక్రమంలో కారింగు నరసింహ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నక్క శీను, వార్డు సభ్యులు భీమనగోని యాదయ్య, పగిల్ల వంశీ, సిరిపంగి శ్రీను, నీలయ్య, బేత జంగయ్య, పగిల్ల వెంకులు తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం పోలీస్ సంఘం అధ్యక్షుడిగా నవీన్

## 5 ఓట్ల ఆధిక్యంతో విజయం.. ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

## నూతన కార్యవర్గానికి సీపీ అంబర్ కిషోర్ ఝూ అభినందనలు



**మంచిర్యాల సెప్టెంబర్ 1 (క్రైమ్ మిర్రర్):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా ముగిశాయి. కమిషనరేట్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ఎన్నికల్లో శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ వి.నవీన్‌కు మార్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సమీప ప్రత్యర్థి ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ రాంచందర్‌పై ఐదు ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. మొత్తం 70 మంది పోలీస్ అధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నా రు.కమిష నర్ అంబర్ కిషోర్ ఝూ ఆదేశాల మేరకు నోడల్ అధికారి, అదనపు డీసీపీ కె.శ్రీనివాస్ పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల ఏర్పాట్లు, ఓటింగ్ ప్రక్రియను సీపీ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులుగా అదనపు డీసీపీ శ్రీనివాస్, ఏసీపీలు నాగేంద్రగౌడ్, రమేష్, ఏఓ శ్రీనివాస్ వ్యవహరించగా.. స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ భీమేష్, ఎస్ఐ చంద్రశేఖర్ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు.

**నూతన కార్యవర్గం**


ఉపాధ్యక్షులుగా ఎన్.శ్రీనివాస్ (ఇన్‌స్పెక్టర్, సైబర్‌క్రైమ్), ఎం.తిరుపతి (ఏఎస్ఐ, పెద్దపల్లి రూరల్), ప్రధాన కార్యదర్శిగా జె.అంజనేయులు (ఎస్ఐ, సీసీబీ రామగుండం), సంయుక్త కార్యదర్శిగా కె.ఓంకార్ (కానిస్టేబుల్, రామకృష్ణాపూర్), సంస్థాగత కార్యదర్శిగా డి.వినోద్‌బాబు (కానిస్టేబుల్, ఎస్టీపీసీ), కోశాధికారిగా టి.సుందర్‌సింగ్ (కానిస్టేబుల్, ధర్మారం) ఎన్నికయ్యారు.కార్యనిర్వాహక సభ్యులుగా ఎం.డి.రిజ్వాన్ షా ఖాన్, డి.అనిల్‌కుమార్, సి.హెచ్.దేవరాజ్.. కార్యవర్గ సభ్యులుగా ఎం.రాజిత, ఎ.కపిల్, డి.రాజం ఎన్నికయ్యారు.

**సీపీకి మర్యాదపూర్వకంగా కలిసిన నూతన కార్యవర్గం**

ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం సీపీ అంబర్ కిషోర్ ఝూను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు అందజేశారు. అనంతరం విజేతలకు సీపీ ఎన్నికల ధ్రువీకరణ పత్రాలను అందించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై సంఘం ప్రతినిధులు తక్షణమే స్పందించాలని సూచించారు. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ బాధ్యతాయుతంగా, సమన్వయంతో పనిచేసి పోలీస్ సిబ్బందికి అండగా నిలవాలని ఆకాంక్షించారు.

# శ్రీ పోచమ్మ తల్లి ఆలయ 5వ వార్షికోత్సవ వేడుకలు

## అమ్మవారిని దర్శించుకున్న మాజీ మేయర్ మహేందర్ గౌడ్



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** బండ్లగూడ జాగీర్ పరిధిలోని 121వ డివిజన్ పద్మశ్రీ హిల్స్‌లో శ్రీ పోచమ్మ తల్లి ఆలయ 5వ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ మహేందర్ గౌడ్, రాజు యాదవ్ ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీ కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ సభ్యులతో కలిసి వారు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా, పద్మశ్రీ హిల్స్‌తో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో ఆలయ సభ్యులు, స్థానిక ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ నాయకుల పర్యటన

## లక్ష్మీగూడ బృందావన్ కాలనీలో సమస్యలు అడిగి తెలుసుకున్న నాయకులు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ నాయకులు మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో పర్యటించారు. డివిజన్ పరిధిలోని లక్ష్మీగూడ బృందావన్ కాలనీలో స్థానికంగా నెలకొన్న సమస్యలను నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు ధనుంజయ, టి. ప్రేమ్ గౌడ్, కళ్లెం లక్ష్మారెడ్డి, బొల్ల వెంకటేశ్వర్లు, ఆంజనేయులు గౌడ్, ఏసు, యాంజల శేఖర్ నేత, అశోక్, జగ్గు, విజయ్, మానస తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కాలనీ వాసులతో మాట్లాడారు స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. కాలనీలోని ప్రజా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తామని తెలిపారు. ఈ పర్యటనలో బస్తీ వాసులు, స్థానిక ప్రజలు పాల్గొని తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకెళ్లారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల అభివృద్ధికి పెద్దపీట వేస్తుంది

## రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

## గణేష్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో అల్పాహార పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని కాటేదాన్ గణేష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ప్రభుత్వం, అక్షయ పాత్ర సహకారంతో అల్పాహార పథకం కార్యక్రమను మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్ విద్యా శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. విద్యార్థులు ఉదయం పూట పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండటంతో పాటు చదువుపై మరింత ఏకాగ్రత సాధిస్తారని తెలిపారు. ప్రభుత్వం, అక్షయ పాత్ర ఫౌండేషన్ సహకారంతో పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, విద్యాభివద్ధికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాలల్లో మౌలిక వసతుల అభివద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్ మాట్లాడుతూ రాజేంద్రనగర్ మండల పరిధిలో మొత్తం 50 స్కూల్స్‌లో 24 ప్రభుత్వ స్కూళ్లల్లో ప్రారంభించినట్లు తెలిపారు. ఈ నెల 14వ తేదీ మరో 26 పాఠశాలల్లో అల్పాహార పతకం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ టి. ప్రేమ్ దాస్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు ఎన్ ధనుంజయ, టి ప్రేమ్ గౌడ్, సానం నర్సింగ్, సరికొండ వెంకటేష్, బాస శ్రీనివాస్ నేత, పులిజాలవివేక్, గట్టయ్య, అర్థం లక్ష్మయ్య గుప్తా , సానం రాజు, సన్నావుల, బొల్లా వెంకటేష్ నేత, కాశి గారి యాదగిరి నేత, ఎల్లప్ప, ఎన్ నరసింహ, పున్న కృష్ణ నేత, ఏసు, గోవింద్, సుందర్, జగదీష్,ఆంజనేయులు, కోట పవన్ కుమార్ నేత, బొనకుర్తి రాము నేత, యాంజల శేఖర్ నేత, ప్రశాంత్, విజయ్, రాజు, విద్యాశాఖ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.